



చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



తక్షణమే సాయం అందించండి

- 10 రోజుల్లో కేంద్రానికి నివేదిక ఇవ్వండి
- ఒకేసారి రెండు తుఫాన్లతో నష్టపోయాం
- కోస్తాంధ్రలో మౌలికవసతుల బలోపేతానికి శాశ్వత పరిష్కారానికి చర్యలు అవసరం
- కేంద్ర బృందానికి సీఎం చంద్రబాబు విజ్ఞప్తి

2



నిడదవోలు మండలం సింగవరంలో దెబ్బతిన్న వరిని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

మురసు తుఫాన్‌తో నష్టపోయిన రాష్ట్రానికి తక్షణమే సాయం అందించాలని సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ఓ వైపు ఎల్‌ని నో.. మరోవైపు ఒకేసారి రెండు తుఫాన్లు రావడం రాష్ట్రానికి భారీ నష్టం కలిగిందని తెలిపారు. ఆదివారం రాజధాని అమరావతిలో మురసు తుఫాన్ నష్టం అంచనా వేయడానికి వచ్చిన కేంద్ర బృందంతో ఆయన వర్చువల్‌గా సమావేశమయ్యారు. కోస్తాంధ్ర ప్రాంతం తరచూ తుఫాన్‌లు ఎదుర్కొంటూనే ఉందని తెలిపారు. శాశ్వత పరిష్కారంగా కేంద్ర సాయం కావాలని కోరారు. 10 రోజుల్లో తుఫాన్ నష్టంపై కేంద్రానికి నివేదిక సమర్పించి తక్షణమే సాయం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభు త్వం రూపొందించిన ప్రాథమిక అంచనాల ప్రకారం మురసు తుఫాన్ కారణంగా మొత్తం రూ.2,484 కోట్ల మేర నష్టం సంభవించిందని చెప్పారు.

- కుమార్తె వివాహానికి రండి...



ముఖ్యమంత్రి చంద్రబాబును హైదరాబాద్‌లోని నివాసంలో ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిల కలిశారు. తన కుమార్తె వై.ఎస్.అంజిలిరెడ్డి-సోమల రఘురామ్‌రెడ్డిల వివాహ మహోత్సవానికి రావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు.

కార్యకర్తే అధినేత!

- టీడీపీ మేయర్ అభ్యర్థిగా సామాన్యుడు
- నినాదాన్ని నిజం చేసి చూపిన నారా లోకేష్
- మంగళగిరిలో చారిత్రక అధ్యాయానికి శ్రీకారం




అమరావతి(చైతన్యరథం): మంగళగిరి రాజకీయ చరిత్రలో తెలుగుదేశం పార్టీ మరో చారిత్రాత్మక అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. ఆర్థిక బలం, రాజకీయ పలుకుబడి, ఆస్తిపాస్తులు కాకుండా పార్టీ పట్ల విధేయత, నిబద్ధత, అంకితభావానికే ప్రాధాన్యమిస్తూ ఎస్టీ సామాజికవర్గానికి చెందిన అట్టడుగు స్థాయి సామాన్య కార్యకర్తను మేయర్ బరిలో నిలిపింది. ఎప్పటి నుంచో పార్టీకి విధేయుడిగా ఉంటూ కష్టకాలంలోనూ పార్టీ వెన్నంటే నిలిచిన సామాన్య కార్యకర్త పేరం ఏడుకొండలును గుర్తించి మేయర్ పీఠానికి ఎంపిక చేయడం ద్వారా మంత్రి నారా లోకేష్ మరోసారి తన ప్రత్యేకతను చాటుకున్నారు. కార్య కర్తే అధినేత అన్న నినాదాన్ని నిజం చేశారు. ఈ నిర్ణయంతో మంగళగిరి పేరు మరో సారి రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. కష్టపడే కార్యకర్తలకు సముచిత గుర్తింపు లభిస్తుందనే నమ్మకాన్ని తెలుగుదేశం పార్టీ బలపరిచింది.

ఏపీ తీరం వైపు తుపాను..

- గురు, శుక్రవారాల్లో భారీ వర్షాలు
- నేడు తుపానుగా, రేపటికి తీవ్ర తుపానుగా మారే అవకాశం
- ఉత్తర వాయవ్య దిశగా కదులుతున్న వాయుగుండం
- మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లొద్దని హెచ్చరిక
- కోస్తా తీరం వెంబడి క్రమంగా పెరగనున్న ఈదురుగాలుల వేగం

4



ఏఈఐ ర్యాంకింగ్స్‌పై జగన్ క్రెడిట్ చోరీ డ్రామా!

- సామాజిక భద్రత, న్యాయ వ్యవస్థల్లో ఏపీ నంబర్ వన్..
- కూటమి ప్రభుత్వ సమర్థ పాలనకు నిదర్శనం
- ప్రజల ముఖాల్లో చిరునవ్వులు పెరిగే కొద్దీ జగన్‌కు క్రెడిట్ చోరీ డిసీజ్ పెరుగుతోంది
- సొంత తల్లి, చెల్లికి న్యాయం చేయని జగన్.. న్యాయం, సామాజిక భద్రత గురించి మాట్లాడటం విడ్డూరం
- ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్

- వివరాలు 5 లో..




ప్రశాంతంగా పురపోరు

రెండో దశ నామినేషన్లు

ఆదివారం ఒక్కరోజే 1,502...

రెండురోజుల్లో 1774 దాఖలు



అమరావతి(చైతన్యరథం): ఏపీలో 23 పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగుతోంది. ఆదివారం ఒక్కరోజే మొత్తం 1,502నామినేషన్లు దాఖలు అయ్యాయి. ఇందులో మేయర్, చైర్మన్ పదవులకు 69, వార్డు సభ్యుల పదవులకు 1,433 నామినేషన్లు ఉన్నాయి. కాగా ఇప్పటివరకు రెండురోజుల్లో మేయర్, చైర్మన్ పదవులకు 85, వార్డు సభ్యుల పదవులకు 1,689 నామినేషన్లు కలిపి మొత్తం 1,774 నామినేషన్లు దాఖలు అయ్యాయి. 4 మున్సిపల్ కార్పొరేషన్లకు, 19 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు నామినేషన్ల ప్రక్రియ జోరుగా కొనసాగుతోంది. సోమవారం నాడు అధికంగా నామినేషన్లు దాఖలయ్యే అవకాశం ఉంది.

తక్షణమే సాయం అందించండి

- 10 రోజుల్లో కేంద్రానికి నివేదిక ఇవ్వండి
- ఒకేసారి రెండు తుఫాన్లతో నష్టపోయాం
- కోస్తాంధ్రలో మౌలికవసతుల బలోపేతానికి శాశ్వత పరిష్కారానికి చర్యలు అవసరం
- కేంద్ర బృందానికి సీఎం చంద్రబాబు విజ్ఞప్తి



అమరావతి(చైతన్యరథం): రాష్ట్రానికి తక్షణ తుఫాన్ సహాయం అవసరమని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర బృందానికి విజ్ఞప్తి చేశారు. మురసు తుఫాన్ నష్టాన్ని అంచనా వేయడానికి రాష్ట్రంలో పర్యటించిన కేంద్ర బృందం ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబుతో వర్చువల్‌గా సమావేశమైంది. కేంద్ర హోంశాఖ సంయుక్త కార్యదర్శి చిత్తరంజన్ దాస్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల బృందం క్షేత్రస్థాయిలో తాము పరిశీలించిన అంశాలను వివరిం చింది. రాష్ట్రంలో ఎల్‌నినో, వరుస తుఫాన్ల వల్ల ఎదుర్కొంటున్న పరిస్థితులను సీఎం చంద్రబాబు వివరించగా... తాము క్షేత్రస్థాయిలో పరిశీలించిన విషయాలను కేంద్ర బృందం ప్రస్తావించింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో తుఫాన్ ప్రభావం, ప్రభుత్వం చేపట్టిన ముందస్తు చర్యలు, సహాయక కార్యక్రమాలు, పునరుద్ధరణ పనుల గురించి ముఖ్యమంత్రి వివరించారు. వరుస తుఫాన్లతో రైతులు సహా వివిధ రంగాలకు భారీగా నష్టం వాటిల్లిందని తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి తక్షణ సాయాన్ని కేంద్రం అందించా ల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అలాగే తీర ప్రాంతంలో తుఫాన్లకు దెబ్బతినకుండా మౌలిక సదుపాయాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని... ఈ మేరకు కేంద్రం సహకారం ఇవ్వాలని కోరారు. కేంద్ర బృందం కూడా క్షేత్రస్థాయి పరిస్థి తులను అధ్యయనం చేసింది కాబట్టి... కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చే నివేదికలో ఇక్కడ జరిగిన నష్టాన్ని పూర్తిస్థాయిలో వివరించాలని కోరారు. వీలైనంత త్వరగా 10 రోజుల్లో నివేదికను సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాలని సూచించారు.

కేంద్ర బృందం పరిశీలనలో కీలక అంశాలు

కేంద్ర బృందం తాము క్షేత్రస్థాయిలో పరిశీలించిన అంశాలను ముఖ్యమంత్రికి వివరించింది. ఫ్లాష్ ఫ్లడ్స్ కారణంగా ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయని, విద్యుత్ స్తంభాలకు కూడా భారీ నష్టం వాటిల్లిందని తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే కాలువలు, వాగుల్లో పూడికతీత పనులు చేపట్టడం వల్ల నష్టం చాలావరకు తగ్గిందని అభిప్రాయ పడింది. ప్రత్తి వంటి వాణిజ్య పంటలకు బీమా ప్రీమియం అధికం గా ఉండటంతో ఎక్కువ మంది రైతులు బీమా చేయించుకోలేదనే విషయాన్ని గుర్తించినట్టు పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో కచ్చా ఇళ్లు తుఫాన్ కారణంగా దెబ్బతిన్నాయని, బాధిత కుటుంబాలకు 30 రోజుల్లో మూడుసార్లు రేషన్ అందించే అంశాన్ని పరిశీలించా లని సూచించింది.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు ప్రీ-స్కూల్ యూనిఫామ్స్ అందించాలని, తుఫాన్ ప్రభావానికి గురైన గిరిజనులను ప్రత్యేకంగా ఆదుకోవాలని తెలిపింది. ప్రకృతి వ్యవసా యం, సేంద్రియ పద్ధతుల్లో సాగు చేస్తూ నష్టపోయిన రైతులకు అధిక పరిహారం అందించే అంశాన్ని పరిశీలించాలని సూచించిం ది. అర్నబ్ తుఫాన్‌తో పోలిస్తే మురసు తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలతో తూర్పుగోదావరి జిల్లాలో వరి పంటకు 80 శాతం, ఏలూరు జిల్లాలో 90 శాతం వరకూ నష్టం వాటిల్లిన ట్లు పేర్కొంది. ఉద్యాన పంటల్లో మామిడి, బొప్పాయి ఎక్కువగా దెబ్బతిన్నాయని వివరించింది.

60 ప్రాంతాల్లో కేంద్ర బృందం పర్యటన

కేంద్ర హోంశాఖ సంయుక్త కార్యదర్శి చిత్తరంజన్ దాస్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల కేంద్ర బృందం రెండు బృందాలు గా విడిపోయి బాపట్ల, పల్నాడు, ఏలూరు, తూర్పుగోదావరి జిల్లాల్లో పర్యటించింది. దాదాపు 60 ప్రాంతాల్లో పంట పొలాలు, కాలువలు, రహదారులు, ఇళ్లు, ఇతర మౌలిక వసతులకు జరిగిన నష్టాన్ని పరిశీలించింది. బాపట్ల, జమ్మలపాలెం, చీరాల, చిన్నగంజాం, పర్చూరు, నిడమర్రు, ఉంగుటూరు, చిలకలూరిపేట, గౌరీపట్నం తదితర ప్రాంతాల్లో పర్యటించింది. భీమడోలు మండ లం సూరప్పగూడెంలో పంట నష్టంపై రైతులతో బృందం నేరుగా మాట్లాడింది. రావులపర్రులో డ్రైనేజీ వ్యవస్థ, వరి పంటలను పరి శీలించింది. కునకలమర్రులో కొమ్ము కాలువ, సాగునీటి వ్యవస్థను తనిఖీ చేసింది. చీరాలలో మత్స్యకారుల పడవలకు జరిగిన నష్టాన్ని, బొప్పూడిలో పక్కా ఇళ్లు, ఉద్యాన పంటలు, వ్యవసాయం, బాతుల పెంపకందారులకు జరిగిన నష్టాన్ని పరిశీలించింది. ఎడ్లపాడు--తుర్లపాడు మధ్య జలాది మీదుగా ఉన్న ఆర్ అండ్ బీ రహదారుల పరిస్థితిని కూడా అంచనా వేసింది.

రూ.2,484 కోట్ల మేర నష్టం

రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ప్రాథమిక అంచనాల ప్రకారం మురసు తుఫాన్ కారణంగా మొత్తం రూ.2,484 కోట్ల మేర నష్టం సంభవించింది. ఇందులో రహదారులు, వ్యవసాయం, ఉద్యాన పంటలు, విద్యుత్ వ్యవస్థలు, ఇళ్లు, సాగునీటి వనరులతో పాటు పలు ఇతర రంగాలు ఉన్నాయి. తుఫాన్ కారణంగా 1,385 కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతిన్నాయి. వీటివల్ల రూ.888 కోట్ల విలువైన రహదారులకు నష్టం వాటిల్లింది. గ్రామీణ ప్రాం తాల్లో 220 కిలోమీటర్ల మేర 114 రహదారులు దెబ్బతిన్నాయి. వ్యవసాయ రంగంలో 1,43,617 హెక్టార్లలో పంటలు దెబ్బ తినగా, రూ.875 కోట్ల నష్టం వాటిల్లింది. మొత్తం 1,86,063 మంది రైతులు ప్రభావితమయ్యారు. ఉద్యాన పంటలకు సంబం ధించి 6,756 హెక్టార్లలో పంటలు దెబ్బతినగా, రూ.337 కోట్ల నష్టం సంభవించింది. 12,605 మంది రైతులు నష్టపోయారు. సాగునీటి రంగంలో 369 వనరులు దెబ్బతినగా, 509 చోట్ల గండ్లు పడ్డాయి. విద్యుత్ రంగంలో 10,192 11 కేవీ స్తంభాలు, 6,442 ఎల్‌టీ స్తంభాలు, 1,448 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. అత్యవసర సహాయక చర్యల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.37 కోట్లు ఖర్చుపెట్టింది. తుఫాన్ ప్రభావంతో మొత్తం 3,859 ఇళ్లు దెబ్బతిన్నాయి. వీటితో పాటు వైద్య, ఆరోగ్య శాఖ, మత్స్యశాఖ, పురపాలక శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, గ్రామీణాభివృద్ధి, తాగునీటి సరఫరా, పాఠశాలలు, పశుసంవర్ధ క, చేనేత రంగాల్లోనూ నష్టం సంభవించినట్లు రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర బృందానికి సమర్పించిన నివేదికలో వివరించింది.

రెండో దశ పురపోరు...

కూటమి అభ్యర్థుల ఖరారు



అమరావతి(చైతన్యరథం): రెండో దశ పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు కూటమి అభ్యర్థులను ఖరారు చేశారు. ఈనెల 26న జరగనున్న 23 పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల కోసం టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కసరత్తు పూర్తి చేసి మేయర్, మున్సి పల్ చైర్మన్ స్థానాలకు తమ అభ్యర్థులను ప్రకటించారు. వీటిలో టీడీపీకి ఒక కార్పొరేషన్, 14 మున్సిపాలిటీలు, జనసేనకు రెండు కార్పొరేషన్లు, మూడు మున్సిపాలిటీలు, బీజేపీకి ఒక కార్పొరేషన్, రెండు మున్సిపాలిటీలను కేటాయించారు. ఆయా స్థానాలకు మేయర్, చైర్మన్ అభ్యర్థులను కూడా ప్రకటించారు.

టీడీపీ మేయర్, చైర్మన్ అభ్యర్థులు

మంగళగిరి-తాడేపల్లి	– పేరం ఏడుకొండలు
ఆముదాలవలస	– కూన ప్రమీల
తణుకు	– బసవ వి.వి.ఎస్.రామకృష్ణ
పాలకొల్లు	– ఆబోతుల ఉషారాణి
తాడిగడప	– పీతా గోపీచంద్
గుడివాడ	– మారీదు కరుణ
నరసరావుపేట	– నాగవరపు రూపేష్‌గుప్తా
పొన్నూరు	– కంద్రు విజయలక్ష్మి
కందుకూరు	– పిడికిటి వెంకటేశ్వర్లు
గూడూరు	– చౌటూరి శిరీష
శ్రీకాళహస్తి	– పేట బాలాజీ
చింతలపూడి	– ఖంబం ఎస్తేరురాణి
పొదిలి	– వరికుంట్ల అనిల్‌కుమార్
అల్లూరు	– తోటకూర సునీల్‌కుమార్
బి.కొత్తకోట	– కుడుము శ్రీనివాసులు

జనసేన మేయర్, చైర్మన్ అభ్యర్థులు

శ్రీకాకుళం	– దానేటి రాధారాణి
కాకినాడ	– ఆకుల భవాని
రాజాం	– బనిశెట్టి సౌజన్యలత
భీమవరం	– చుండూరి మల్లీశ్వరి
తాడేపల్లిగూడెం	– పాలూరి వెంకటేశ్వరరావు

బీజేపీ మేయర్, చైర్మన్ అభ్యర్థులు

రాజమండ్రి	– రేలంగి శ్రీదేవి
కావలి	– గుండ్లపల్లి భరత్‌కుమార్
బాపట్ల	– ఇస్కా సునీల్‌కుమార్



ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేశాం
- ఇన్సూరెన్స్ యూనియన్, ఎంప్లాయిస్ యూనియన్ నేతల సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం (చైతన్య రథం): ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎప్పుడూ చిత్తశుద్ధితో పని చేస్తూనే ఉందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు మచిలీపట్నంలోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ యూనియన్, ఎంప్లాయిస్ యూనియన్ మచిలీపట్నం డివిజన్ ప్రతినిధులు కలిశారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ "సీపీఎస్ రద్దు కోసం దశాబ్ద కాలంగా ఉద్యోగులు పోరాటం చేస్తున్నారు. వారి అభ్యర్థన మేరకు రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేసింది. గతంలో కొంతమంది హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక చేతులెత్తేశారు. తెలియక హామీలిచ్చామంటూ మాట మార్చారు. కానీ మేము అలా కాదు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉద్యోగులకు న్యాయం చేశాం. ఎన్ని ఇబ్బందులున్నా ఉద్యోగులకు అండగా నిలిచే లక్ష్యంతో సీపీఎస్ రద్దు చేశాం. ఇప్పుడు ఇన్సూరెన్స్ కంపెనీల్లో కూడా ఓపీఎస్ అమలు కావాల్సిన అవసరం ఉంది. రిక్రూట్‌మెంట్, జాయినింగ్స్ ఆలస్యం కారణంగా.. కొంత జాప్యమవుతోంది. అయినప్పటికీ.. అందరికీ రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించేందుకు సిద్ధంగా ఉంది" అని భరోసానిచ్చారు.

"రాష్ట్రంలో ఫ్రెండ్లీ ప్రభుత్వం ఉంది. అందరూ కలిసి సమిష్టిగా రాష్ట్రాన్ని బాగు చేసుకోవాలనే తపనతో పని చేస్తున్నాం. తాజాగా విశాఖపట్నంలో జరిగిన సీఐఐ సమ్మిట్‌లో రూ.12 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. గతంలో వచ్చిన పెట్టుబడుల్లో ఏకంగా 76 శాతం గ్రౌండ్ అయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా యువతకు 25 లక్షల ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో పని చేస్తున్నాం. రాష్ట్రంలో పెట్టుబడులు ఆకర్షించడం లక్ష్యంగా ప్రత్యేక చట్టాలు తీసుకొచ్చాం. గతంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో ముందుకు వెళ్తే.. ఇప్పుడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో ముందుకు వెళ్తున్నాం. పెట్టుబడులతో వచ్చే వారికి కూడా భద్రత కల్పించే లక్ష్యంతో చట్టం రూపొందించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ఇండస్ట్రీస్‌కి ఇవ్వాల్సినటువంటి ఇన్సెంటివ్స్ కూడా ఎస్క్రో అకౌంట్ పెట్టి ఇబ్బందులు లేకుండా చేయాలని ప్రణాళికలు రచిస్తున్నాం. నారా చంద్రబాబు నాయుడు లాంటి విజనరీ కారణంగానే ఇంతటి విజయాన్ని సాధించగలుగుతున్నాం. అన్ని రంగాల్లో సమస్యల్ని పరిష్కరించుకుంటూ అభివృద్ధి బాటలో అడుగులు వేస్తున్నాం. త్వరలోనే ఎల్.ఐ.సి సమస్య కూడా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి కేంద్రంతో చర్చించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం" అని మంత్రి కొల్లు రవీంద్ర హామీ ఇచ్చారు.

పంచాయతీల్లోనూ ప్రతాపం చూపాలి



- ఎన్డీఏ కూటమి అభ్యర్థులదే ఘనవిజయం కావాలి
- మున్సిపల్, పరిషత్ ఎన్నికల ఫలితాలు పునరావృతం చేద్దాం
- కొలిమిగుండ్ల మండల కూటమి ముఖ్య నేతలతో మంత్రి జనార్దన్‌రెడ్డి

నంద్యాల (చైతన్య రథం), పంచాయతీ ఎన్నికల్లోనూ ఎన్డీఏ కూటమి అభ్యర్థులు ఘనవిజయం సాధించడం ఖాయమని రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన మున్సిపల్, పరిషత్ ఎన్నికల్లో కూటమి సాధించిన అఖండ విజయాన్ని పంచాయతీ ఎన్నికల్లోనూ పునరావృతం చేద్దామని శ్రేణులకు పిలుపునిచ్చారు. కొలిమిగుండ్ల మండల ఎన్డీఏ కూటమి ముఖ్య నాయకులతో ఆదివారం కొలిమిగుండ్లలోని బృందావన కన్వెన్షన్ సెంటర్‌లో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సమావేశమయ్యారు. రాబోయే పంచాయతీ ఎన్నికలకు కూటమి శ్రేణులను సన్నద్ధం చేయడం, గ్రామస్థాయిలో పార్టీల మధ్య సమన్వయం, ఎన్నికల కార్యాచరణ తదితర అంశాలపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేస్తూ పంచాయతీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. "వైసీపీ నుంచి పోటీ చేసేందుకు కనీసం అభ్యర్థులు కూడా ముందుకు రాని పరిస్థితి నెలకొంది" అని ఎద్దేవా చేశారు. ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై విశ్వాసం పెరిగిందని, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే కూటమికి విజయాన్ని అందిస్తాయని పేర్కొన్నారు.

పంచాయతీ ఎన్నికలపై వైసీపీ చేస్తున్న అసత్య ప్రచారాలను మంత్రి తీవ్రంగా ఖండించారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో భయాందోళనలు సృష్టించేందుకు వైసీపీ ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. సర్పంచి పదవులకు బహిరంగ వేలాలు నిర్వహిస్తున్నారని, ఏకగ్రీవాల కోసం బెదిరింపులకు పాల్పడుతున్నారని వైసీపీ చేస్తున్న ప్రచారాన్ని తప్పుపట్టారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. వైసీపీ అధినేత జగన్ ఓటమిని అంగీకరించలేక కూటమి ప్రభుత్వంపై అసత్య ప్రచారాలకు దిగుతున్నారని విమర్శించారు. ఎలాంటి ఆధారాలు లేని ఆరోపణలతో ప్రజల్లో గందరగోళం సృష్టించడం మానుకోవాలని హితవు పలికారు.

ప్రజాస్వామ్యబద్ధంగా జరిగే ఎన్నికల ప్రక్రియపై అనవసర అపోహలు కల్పించకుండా నిర్మాణాత్మకంగా వ్యవహరించాలని సూచించారు. కూటమి నాయకులు, కార్యకర్తలు గ్రామస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ, పరస్పర సమన్వయంతో ఎన్నికల కార్యాచరణను అమలు చేయాలని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పిలుపునిచ్చారు. మున్సిపల్, పరిషత్ ఎన్నికల్లో సాధించిన విజయోత్సాహంతో పంచాయతీ ఎన్నికల్లోనూ కూటమి జెండా ఎగురవేయాలని ఆకాంక్షించారు.

కూటమి జోరు చూపించాలి

- 34 పంచాయతీల్లోనూ కూటమి జెండా ఎగరేసేలా క్షేత్రస్థాయిలో పని చేయాలి
- గెలుపొందిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థులతో సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం (చైతన్య రథం): పంచాయతీ ఎన్నికల్లోనూ మచిలీపట్నంలో కూటమి జెండాను ఎగరవేసేలా ప్రతి కార్యకర్త, ప్రతి నాయకుడు క్షేత్రస్థాయిలో పని చేయాలని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు మచిలీపట్నంలోని క్యాంపు కార్యాలయంలో గెలుపొందిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో అభ్యర్థులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సాధించిన ఈ విజయం కూటమిపై ప్రజలకున్న నమ్మకానికి నిదర్శనమన్నారు. ఇంతటితో సంతృప్తి చెందకుండా, త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో కూడా కూటమి బలోపేతానికి అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మచిలీపట్నం పరిధిలోని 34 పంచాయతీల్లోనూ కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు సమష్టిగా పనిచేయాలని సూచించారు. వైసీపీ ఉనికి కనిపించకుండా చేసే దిశగా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాలను కూడా ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. జల్‌జీవన్ మిషన్ కింద ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నిర్మించిన రోడ్లను ప్రజలకు వివరిస్తూ ముందుకు వెళ్లాలన్నారు. కూటమి ప్రతిష్ఠను నిలబెట్టేలా నాయకులు, కార్యకర్తలు బాధ్యతతో పనిచేయాలని సూచించారు. మీరు పడిన కష్టం, సమష్టి కృషి ఫలితంగానే స్థానిక ఎన్నికల్లో ఘన విజయం సాధించాం. అదే స్ఫూర్తితో పంచాయతీల్లోనూ మన సత్తా చాటాలని మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు. కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ, మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్, తెలుగుదేశం పార్టీ నాయకుడు రొండి కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



చైతన్యరథం

రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులే కాదు..

ప్రచారంలోనూ సరికొత్త ఒరవడి!

- **సీఐఐ భాగస్వామ్య సదస్సును జాతీయస్థాయిలో చర్చనీయాంశంగా మార్చిన వినూత్న మీడియా వ్యూహం**
- **ఒకే భారీ హెడ్‌లైన్‌కు బదులు.. ప్రతి పెట్టుబడినీ ప్రత్యేక వార్తగా మలిచిన ప్రణాళిక**
- **మూడు వారాల ముందే ప్రచారానికి శ్రీకారం.. సదస్సు ముగిసే వరకు నిరంతర వార్తా ప్రవాహం**
- **నాయకుల ఫొటోలకు బదులు కంపెనీలు, పెట్టుబడులు, ఉద్యోగావకాశాలకే ప్రాధాన్యం**
- **ప్రచార వ్యూహరచనలో టీడీపీ జాతీయ మీడియా సమన్వయకర్త శ్రవణ్ సంపత్ కీలక పాత్ర**

అమరావతి (చైతన్య రథం): భారీ పెట్టుబడుల సదస్సు అంటే వేల కోట్ల రూపాయల ఒప్పందాలు.. ప్రముఖుల ప్రసంగాలు.. చివరగా మొత్తం పెట్టుబడుల విలువతో ఒక భారీ వార్త! సాధారణంగా ఇలాంటి సదస్సుల ప్రచారం ఇంతటితో ముగుస్తుంది. కానీ నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖపట్నంలో జరిగిన 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు ప్రచారంలో ఆంధ్రప్రదేశ్ సరికొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది. రూ.10 లక్షల కోట్ల పెట్టుబడుల ప్రకటన ఒక్కటే వార్త కాకుండా.. ప్రతి కీలక పెట్టుబడి, ప్రతి ప్రాజెక్టు ప్రత్యేక విజయగాథగా ప్రజల్లోకి వెళ్లేలా వినూత్న మీడియా వ్యూహాన్ని అమలు చేసింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవతో జరిగిన ఈ సదస్సు పెట్టుబడుల ఆకర్షణతోపాటు వాటిని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పరిచయం చేసిన తీరులోనూ ప్రత్యేకత చాటుకుంది.

సదస్సుకు మూడు వారాల ముందే ప్రచారానికి శ్రీకారం

సాధారణంగా పెట్టుబడుల సదస్సులపై ప్రచారం ప్రారంభానికి ఒకటి రెండు రోజుల ముందు ఊపందుకుంటుంది.కానీ విశాఖసదస్సు విషయంలో ముందస్తు వ్యూహాన్ని అమలు చేశారు. రెండు మూడు వారాల ముందుగానే రాష్ట్రానికి రానున్న పెట్టుబడులు, కంపెనీల విస్తరణ ప్రణాళికలు, పారిశ్రామిక అవకాశాలపై ప్రత్యేక కథనాలు వెలువడేలా చర్యలు చేపట్టారు. కియా అనుబంధ సంస్థల విస్తరణ, కియా రెండు బిలియన్ డాలర్ల పెట్టుబడులకు సంబంధించిన వార్తలు ముందుగానే మీడియాలో చర్చకు వచ్చాయి. దీంతో సదస్సు ప్రారంభానికి ముందే జాతీయ మీడియా, పారిశ్రామిక వర్గాల్లో ఆంధ్రప్రదేశ్ పెట్టుబడుల అవకాశాలపై ఆసక్తి పెరిగింది.

తొలిరోజే జాతీయ పత్రికల మొదటి పేజీల్లో ఏపీ

సదస్సు ప్రారంభమైన రోజే దేశవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ పేరు ప్రముఖంగా కనిపించాలనే లక్ష్యంతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో జాతీయ వ్యాపార పత్రికలకు ముందుగానేప్రత్యేక ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశారు. నవంబర్ 12 ఉదయం వరకు ప్రచురించకూడదనే నిబంధనతో ఈ ఇంటర్వ్యూలు అందించారు. మరోవైపు పెట్టుబడుల ప్రోత్సాహక చట్టానికి సంబంధించిన అంశాలను కూడా ముందుగానే మీడియా దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి ప్రారంభ ప్రసంగానికి ముందే ఈ అంశం ప్రముఖ పత్రికల మొదటి పేజీల్లో చోటు సంపాదించింది. ఫలితంగా సదస్సు తొలిరోజే జాతీయ వ్యాపార పత్రికల్లో ఆంధ్రప్రదేశ్ ప్రధాన వార్తగా నిలిచింది.

గంటకో వార్త.. ప్రతి పెట్టుబడికీ ప్రత్యేక గుర్తింపు

ఈ సదస్సు ప్రచారంలో అత్యంత కీలకమైన అంశం వార్తల విడుదల విధానం. మొత్తం పెట్టుబడుల విలువను ఒకేసారి ప్రకటించి సరిపెట్టకుండా, ఒక్కో సంస్థ పెట్టుబడి, ఒక్కో ప్రాజెక్టు ప్రత్యేకతను వివరిస్తూ దాదాపు ప్రతి గంటకూ ఒక కొత్త వార్తను విడుదల చేసేలా ప్రణాళిక రూపొందిం చారు. రెన్యూ, క్లీన్‌మ్యాక్స్, గెయిల్ వంటి సంస్థల పెట్టుబడులకు ప్రత్యేక ప్రాధాన్యం కల్పించారు. ముఖ్యమైన కథనాలను ఎంపిక చేసిన మీడియా సంస్థలకు ప్రత్యేకంగా అందించడం ద్వారా వాటికివిస్తృత కవరేజీ లభించేలా చూశారు. ఫలితంగా ఒకే వార్తను అన్ని పత్రికలు ప్రచురించే పరిస్థితికి బదులుగా, వివిధ పత్రికల్లో వివిధ పెట్టుబడులపై ప్రత్యేక కథనాలు వెలువడ్డాయి. ఒక్కరోజు వార్తగా ముగిసిపోయే సదస్సును రెండు రోజులపాటు నిరంతర వార్తా ప్రవాహంగా మార్చగలిగారు.

సినీ, మీడియా ప్రముఖులతో యువతకూ చేరువ

పెట్టుబడుల సదస్సు కేవలం పారిశ్రామికవేత్తలు, ఆర్థిక నిపుణులకే పరిమితం కాకూడదనే ఉద్దేశంతో సామాజిక మాధ్యమాల ప్రచారంపైనా ప్రత్యేక దృష్టి సారించారు. ప్రముఖ నటుడు రానా దగ్గుబాటి, జర్నలిస్టు పాల్కీ శర్మ, ఉపాసన కామినేని కొణిదెల వంటి ప్రముఖులను వివిధ చర్చా కార్యక్రమాల్లో భాగస్వాములను చేశారు. వీరి భాగస్వామ్యంతో సదస్సు విశేషాలు వ్యాపారవర్గాలను దాటి యువతకు, సాధారణ ప్రజలకు చేరువయ్యాయి. సామాజిక మాధ్యమాల్లోనూ ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులపై విస్తృత చర్చకు అవకాశం ఏర్పడింది.

ముఖ్యమంత్రే కాదు.. పారిశ్రామికవేత్తలకూ ప్రాధాన్యం

సాధారణంగా ఇలాంటి సదస్సుల్లో ముఖ్యమంత్రి, మంత్రుల ప్రసంగాలకే అధిక ప్రచారం లభిస్తుంది. ఈసారి అందుకు భిన్నంగా దేశవిదేశీ ప్రతినిధులు, రాయబారులు, ప్రముఖ కంపెనీల సీఈవోలు, చైర్మన్లు, పెట్టుబడుల శాఖల ఉన్నతాధికారులతో ప్రత్యేక ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎందుకు పెట్టుబడులు పెడుతున్నారు? రాష్ట్రంలో ఎలాంటి అవకాశాలు ఉన్నాయి? ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం లభిస్తోంది? వంటి అంశాలను పారిశ్రామికవేత్తల మాటల్లోనే ప్రజలకు వివరించే ప్రయత్నం చేశారు. దీంతో ప్రభుత్వ ప్రకటనలతో పాటు పెట్టుబడిదారుల అభిప్రాయాలకూ మీడియాలో ప్రాధాన్యం లభించింది.

స్టార్టప్‌లు, చిన్న పరిశ్రమలకూ పెద్దపీట

భారీ కంపెనీల పెట్టుబడుల మధ్య చిన్న పరిశ్రమలు, స్టార్టప్‌లు మరుగునపడకూడదనే ఉద్దేశంతో వాటికి ప్రత్యేక ప్రదర్శనశాలను ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ యువ పారిశ్రామికవేత్తల ఆవిష్కరణలు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల సామర్థ్యాన్ని ప్రదర్శించే అవకాశం కల్పించారు. ఈ ప్రదర్శనలకు మీడియా ద్వారా మంచి గుర్తింపు లభించింది. భారీ పెట్టుబడులతోపాటు స్థానిక పారిశ్రామికవేత్తల ఎదుగుదలకూ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లగలిగారు.

ప్రభుత్వ ప్రకటనల్లో నాయకుల ఫొటోలు లేవు.. పెట్టుబడులే ప్రధాన ఆకర్షణ

సదస్సు ప్రచారంలో మరో విశేషం ప్రభుత్వ ప్రకటనల రూపకల్పన. సాధారణంగా ప్రభుత్వ కార్యక్రమాల ప్రకటనల్లో ముఖ్యమంత్రి,మంత్రుల ఫొటోలకే అధిక ప్రాధాన్యం ఉంటుంది. కానీ ఈసారి అందుకు భిన్నంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ ఫొటోలు లేకుండానే కంపెనీలు, వాటి పెట్టుబడులు, రాష్ట్రంలో ఏర్పాటయ్యే పరిశ్రమలు, ఉద్యోగావకాశాలను ప్రధానంగా చూపిస్తూ ప్రకటనలు రూపొందించారు. వ్యక్తుల ప్రచారం కంటే రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడుల ప్రచారమే ముఖ్యమనే ఆలోచనకు ఈ ప్రకటనలు అద్దం పట్టాయి. ఈ వినూత్న విధానం పారిశ్రామిక వర్గాల్లోనూ సానుకూల స్పందనకు కారణమైంది.

తెరవెనుక ప్రచార వ్యూహంలో శ్రవణ్ సంపత్ కీలక పాత్ర

సీఐఐ భాగస్వామ్య సదస్సుకు జాతీయస్థాయిలో విస్తృత ప్రచారం కల్పించేలా రూపొందించిన మీడియా వ్యూహంలో తెలుగుదేశం పార్టీ జాతీయ మీడియా సమన్వయకర్త శ్రవణ్ సంపత్ కీలకంగా వ్యవహరించారు. సదస్సుకు ముందే దేశవ్యాప్తంగా ఆసక్తి పెంచడం, జాతీయ వ్యాపార పత్రికలకు ప్రాధాన్యమున్న కథనాలు అందించడం, ప్రధాన పెట్టుబడులను ప్రత్యేక వార్తలుగా మలచడం వంటి అంశాల ప్రణాళికలో ముఖ్యపాత్ర పోషించారు. సదస్సు రెండు రోజులకే ప్రచారం పరిమితం కాకుండా ముందుగానే కథనాలు ప్రారంభమయ్యేలా, కార్యక్రమం జరుగుతున్నంతసేపూ నిరంతర వార్తాప్రవాహం కొనసాగేలా రూపొందించిన కార్యాచరణలో ఆయన భాగస్వామ్యం కీలకమైంది.

ముఖ్యంగా ఒకే భారీ పెట్టుబడుల ప్రకటనతో ప్రచారం ముగియకుండా, ప్రతి కీలక పెట్టుబడికీ జాతీయ మీడియాలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలనే వ్యూహాన్ని అమలు చేయడంలో శ్రవణ్ చొరవ చూపారు. జాతీయ మీడియా సంస్థలతో సమన్వయం, ప్రత్యేక ఇంటర్వ్యూల ప్రణాళిక, వివిధరంగాల పెట్టుబడులను వేర్వేరు కథనాలుగా ప్రజల్లోకి తీసుకెళ్లే విధానంలో ఆయన కృషి సదస్సు ప్రచారానికి బలాన్నిచ్చింది. రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి ప్రయత్నాలను జాతీయస్థాయిలో సమర్థంగా పరిచయం చేయడంలో ప్రణాళికాబద్ధమైన మీడియా సమన్వయం ఎంత కీలకమో ఈ సదస్సు చాటిచెప్పింది.

రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు.. అంతకుమించిన ప్రచార విజయం


విశాఖ సీఐఐ భాగస్వామ్యసదస్సు ద్వారా సుమారు రూ.10 లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు కుదిరాయనే భారీ వార్తతోపాటు, వాటి వెనుక ఉన్న కంపెనీలు, ప్రాజెక్టులు, ఉద్యోగావకాశాలు, భవిష్యత్తు పారిశ్రామిక ప్రణాళికలను ప్రజలకు వివరించగలిగారు. సదస్సుకు ముందే ఆసక్తి కల్పించడం, ప్రారంభ రోజే జాతీయ పత్రికల మొదటి పేజీల్లో నిలవడం, గంటకో ప్రత్యేక వార్త విడుదల చేయడం, పారిశ్రామికవేత్తల ఇంటర్వ్యూలు, సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం, స్టార్టప్‌లకు గుర్తింపు, నాయకుల ఫొటోలు లేని ప్రకటనలు.. ఇలా ప్రతి అంశంలోనూ వినూత్నతను ప్రదర్శించారు.

పెట్టుబడుల ఒప్పందాలు కుదుర్చుకోవడం ఒక విజయం..వాటి ప్రాధాన్యాన్నిదేశానికి తెలియజేయడం మరో విజయం. విశాఖ సీఐఐ భాగస్వామ్య సదస్సు ఈ రెండు లక్ష్యాలనూ సాధించే దిశగా ముందడుగు వేసింది.ఒక్క భారీ హెడ్‌లైన్‌తో సరిపెట్టకుండా.. ప్రతి పెట్టుబడినీ ఒక విజయగాథగా, ప్రతి విజయగాథనూ ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధికి నిదర్శనంగా ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ వినూత్న ప్రచార వ్యూహం ప్రత్యేకత.

ఏపీ తీరం వైపు తుపాను..

- **గురు, శుక్రవారాల్లో భారీ వర్షాలు**
- **నేడు తుపానుగా, రేపటికి తీవ్ర తుపానుగా మారే అవకాశం**
- **ఉత్తర వాయవ్య దిశగా కదులుతున్న వాయుగుండం**
- **మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లొద్దని హెచ్చరిక**
- **కోస్తా తీరం వెంబడి క్రమంగా పెరగనున్న ఈదురుగాలుల వేగం**

అమరావతి (చైతన్య రథం): ఆగ్నేయ బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం ఉత్తర వాయవ్య దిశగా కదులుతోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ, ఆర్టీజీఎస్ సీఈవో ప్రఖర్ జైన్ తెలిపారు. గడిచిన ఆరు గంటల్లో గంటకు 15 కిలోమీటర్ల వేగంతో ఈ వాయుగుండం పయనించిందని వెల్లడించారు. ప్రస్తుతం ఇది శ్రీలంకలోని ట్రింకోమలికి 620 కిలోమీటర్లు, అండమాన్ నికోబార్ దీవుల్లోని శ్రీ విజయ పురానికి 680 కిలోమీటర్లు, చెన్నైకి 800 కిలోమీటర్లు, విశాఖపట్నానికి 960 కిలోమీటర్లు, ఒడిశాలోని గోపాల్‌పూర్‌కు 1,070 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని పేర్కొన్నారు. వాయుగుండం ఉత్తర వాయవ్య దిశగా పయనిస్తూ ఆదివారం దక్షిణ బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తుపానుగా మారిందన్నారు. సోమవారం (నవంబర్ 17) పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని తెలిపారు. తర్వాత రెండు రోజుల్లో మరింత బలపడి వాయవ్య దిశగా ఆంధ్రప్రదేశ్ తీరంవైపు కదిలే అవకాశ ముందని వివరించారు. తుపాను ప్రభావంతో గురు, శుక్రవారాల్లో కోస్తాంధ్రలో భారీనుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. కోస్తాంధ్ర తీరం వెంబడి మంగళవారం వరకు గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని, ఆ తర్వాత గాలుల వేగం క్రమంగా పెరుగుతుందని తెలిపారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని హెచ్చరించారు. ప్రజలు, రైతులు వాతావరణ పరిస్థితులను గమనిస్తూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రఖర్ జైన్ సూచించారు.



చైతన్యరథం

ఏఈఐ ర్యాంకింగ్స్‌పై

జగన్ క్రెడిట్ చోరీ డ్రామా!

- సామాజిక భద్రత, న్యాయ వ్యవస్థల్లో ఏపీ నంబర్ వన్..
- కూటమి ప్రభుత్వ సమర్థ పాలనకు నిదర్శనం
- ప్రజల ముఖాల్లో చిరునవ్వులు పెరిగే కొద్దీ జగన్‌కు క్రెడిట్ చోరీ డిసీజ్ పెరుగుతోంది
- సొంత తల్లి, చెల్లికి న్యాయం చేయని జగన్.. న్యాయం, సామాజిక భద్రత గురించి మాట్లాడటం విడ్డూరం
- ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్



మంగళగిరి (చైతన్య రథం): యాక్సెస్ ఈక్వాలిటీ ఇండెక్స్ (ఏఈఐ) 2026 ర్యాంకింగ్స్‌పై వైసీపీ అధినేత జగన్ క్రెడిట్ చోరీ డ్రామాకు తెరతీశారని ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ జాతీయస్థాయిలో రెండోస్థానం, పెద్ద రాష్ట్రాల విభాగంలో మొదటి స్థానం సాధించడం ఎన్డీఏ కూటమి ప్రభుత్వ సమర్థ పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల ఫలితంగానే ఈ ఘనత సాధ్యమైందని స్పష్టం చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో పట్టాభిరామ్ మాట్లాడుతూ.. ఓపీ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీకి చెందిన సెంటర్ ఫర్ న్యూ ఎకనామిక్ స్టడీస్ విడుదల చేసిన ఏఈఐ 2026 నివేదికలో ఆంధ్రప్రదేశ్ సాధించిన ర్యాంకింగ్స్ రాష్ట్ర ప్రజలకు గర్వకారణమన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో గత రెండున్నరేళ్లుగా కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో సాధిస్తున్న ప్రగతికి ఈ నివేదిక కొలమానంగా నిలుస్తోందని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను పారదర్శకంగా అమలు చేయడం, సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించడం, మౌలిక సదుపాయాల కల్పనలో వేగం పెంచడంవంటి చర్యలతో రాష్ట్రానికి జాతీయస్థాయిలో గుర్తింపు లభించిందన్నారు.

సామాజిక భద్రత, న్యాయ వ్యవస్థల్లో ఏపీ అగ్రస్థానం

ఏఈఐ నివేదికలో తాగునీరు, పారిశుధ్యం, గృహ నిర్మాణం, క్లీన్ ఎనర్జీ, పోషకాహారం, వైద్య సదుపాయాలు, విద్య, ఉపాధి, సామాజిక భద్రత, న్యాయ వ్యవస్థ వంటి అంశాలను ప్రాతిపదికగా తీసుకుని రాష్ట్రాలకు ర్యాంకులు కేటాయించారని పట్టాభిరామ్ వివరించారు. సామాజిక భద్రత విభాగంలో ఆంధ్రప్రదేశ్ 0.69 స్కోర్ సాధించి దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందన్నారు. న్యాయ వ్యవస్థ విభాగంలోనూ ప్రజలకు సత్వర న్యాయం, చట్టపరమైన సదుపాయాల కల్పనలో రాష్ట్రం అత్యధిక స్కోర్ సాధించిందని తెలిపారు. మొత్తం 28 రాష్ట్రాలను మూడు కేటగిరీలుగా విభజించగా, ఫ్రంట్ రన్నర్స్ జాబితాలో ఎనిమిది రాష్ట్రాలు చోటు దక్కించుకున్నాయని చెప్పారు. ఈ జాబితాలో గోవా మొదటి స్థానంలో ఉండగా, ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో నిలిచిందన్నారు. ఆ తర్వాత సిక్కిం, కేరళ, హిమాచల్ ప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ, హర్యానా రాష్ట్రాలు ఉన్నాయని వివరించారు. సామాజిక భద్రత, న్యాయ వ్యవస్థల్లో ఏపీ సాధించిన ఈ ప్రగతి కూటమి ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని పట్టాభిరామ్ పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సామాజిక భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు.

సంక్షేమ పథకాలతో సామాజిక భద్రతకు భరోసా

బడుగు, బలహీన వర్గాలు, దళితులు, మైనారిటీల అభ్యున్నతి కోసం సంక్షేమ ఫలాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా అందించడమే ఎన్డీఏ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పట్టాభిరామ్ అన్నారు. రాష్ట్రానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, గత వైసీపీ ప్రభుత్వంలా మోసపూరిత సంక్షేమానికి పాల్పడకుండా ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. పింఛన్ల పెంపుతోపాటు 'తల్లికి వందనం', 'అన్నదాత సుఖీభవ', మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ పథకాల ఫలితంగానే సామాజిక భద్రత విభాగంలో ఏపీ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని వివరించారు. పేదరికం లేని సమాజాన్ని నిర్మించాలన్న చంద్రబాబు ఆశయానికి ఈ ర్యాంక్ అద్దం పడుతోందన్నారు. గత వైసీపీ పాలనలో రాష్ట్రంలో గుండారాజ్, జంగిల్ రాజ్, సైకో రాజ్ నడిచాయని, సామాన్యులకు కనీస న్యాయం కూడా అందని పరిస్థితి ఉండేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి మారిందని, పటిష్టమైన శాంతిభద్రతల అమలుతో ప్రజల్లో భద్రతాభావం పెరిగిందన్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా సత్వర న్యాయం, ఉచిత న్యాయ సహాయం అందుతాయనే నమ్మకం ప్రజల్లో ఏర్పడిందని తెలిపారు.

విద్య, వైద్యం, పారిశుధ్యంలోనూ మార్పులు

విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీసుకొస్తున్న మార్పులతో ప్రభుత్వ పాఠశాలలు నేడు ప్రైవేటు పాఠశాలలతో పోటీపడే స్థాయికి చేరుకుంటున్నాయని పట్టాభిరామ్ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పూర్తయ్యాయని బోర్డులు పెట్టే పరిస్థితి రావడం విశేషమన్నారు. మౌలిక సదుపాయాల కల్పనతోపాటు మెగా డీఎస్సీ ద్వారా సుమారు 16 వేల మంది ఉపాధ్యాయులను నియమించడం వల్ల విద్యారంగంలో మెరుగైన ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పేరుతో అవినీతి జరిగిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో చేపట్టిన 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' ఉద్యమం ద్వారా పారిశుధ్యంలో గణనీయమైన మార్పు వస్తోందన్నారు. గత ప్రభుత్వం కోటి 50 లక్షల టన్నులకు పైగా చెత్తను ఎక్కడికక్కడ వదిలేసిందని, రోడ్లపై గుంతలు కూడా పూడ్చలేదని విమర్శించారు.

గత ప్రభుత్వంలో అమ్మఒడి పేరుతో తల్లులను, పింఛన్ల పేరుతో వృద్ధులను మోసం చేశారని, పేదలకు భోజనం అందించే అన్నా క్యాంటీన్లను మూసివేశారని పట్టాభిరామ్ ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్లను రూ.1,000 పెంచి, నాలుగు నెలల బకాయిలతో సహా అందించిందని గుర్తు చేశారు. 'తల్లికి వందనం' కింద ప్రతి బిడ్డకూ ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. కోవిడ్ సమయంలో ఆక్సిజన్ అందక ప్రజలు ప్రాణాలు కోల్పోయారని, రెమ్‌డెసివిర్ ఇంజెక్షన్లు, ఐసీయూ బెడ్లు బ్లాక్ మార్కెట్‌కు తరలిన పరిస్థితి గత ప్రభుత్వంలో ఉండేదని ఆరోపించారు.

నేడు ఆరోగ్య రంగంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వల్ల మెరుగైన ఫలితాలు వస్తున్నాయని పేర్కొన్నారు. గత పాలనలో ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టి జైళ్లకు పంపారని, తనపై కూడా రెండుసార్లు థర్డ్ డిగ్రీ ప్రయోగించారని పట్టాభిరామ్ ఆరోపించారు. మాస్క్ అడిగిన డాక్టర్ సుధాకర్‌పై వేధింపులకు పాల్పడ్డారని, మీడియా గొంతు నొక్కే జీవోలు తీసుకొచ్చి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని విమర్శించారు. రెన్యూవబుల్ ఎనర్జీ పీపీఏలను రద్దు చేసి అంతర్జాతీయస్థాయిలో రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీశారని, జగనన్న కాలనీల పేరుతో హౌసింగ్ రంగంలో భారీ అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు.

జగన్‌కు క్రెడిట్ చోరీ డిజార్డర్

2019--2024 మధ్య ఐదేళ్ల పాలనలో అన్ని రంగాలను, వ్యవస్థలను విధ్వంసం చేసిన జగన్ రెడ్డి.. నేడు కూటమి ప్రభుత్వం సాధిస్తున్న ప్రగతిని చూసి ఓర్వలేకపోతున్నారని పట్టాభిరామ్ విమర్శించారు. రాష్ట్రానికి జాతీయస్థాయిలో గుర్తింపు లభించగానే దానికి తానే కారణమంటూ క్రెడిట్ చోరీకి ప్రయత్నిస్తున్నారని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వం సృష్టించిన విధ్వంసాన్ని సరిదిద్దుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గత రెండున్నరేళ్లలో అన్ని వ్యవస్థలను తిరిగి గాడిలో పెట్టారని తెలిపారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటూ బడుగు, బలహీన వర్గాలు, బీసీలు, మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా సామాజిక భద్రత, న్యాయ వ్యవస్థ విభాగాల్లో రాష్ట్రానికి అత్యధిక స్కోర్ రావడం కూటమి పాలనపై ప్రజల్లో ఉన్న నమ్మకానికి నిదర్శనమన్నారు.

గత పాలనలో మహిళలకు రక్షణ కరువైందని, సొంత తల్లికి, చెల్లికే న్యాయం చేయలేని వ్యక్తి నేడు న్యాయం, ధర్మం, న్యాయవ్యవస్థ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. ప్రజల ముఖాల్లో చిరునవ్వులు పెరిగే కొద్దీ జగన్‌కు క్రెడిట్ చోరీ డిసీజ్ పెరుగుతోందని వ్యంగ్యంగా అన్నారు. అన్న క్యాంటీన్లలో భోజనం చేస్తున్న పేదల ముఖాల్లోనూ, ఉచిత బస్సు ప్రయాణం చేస్తున్న మహిళల ముఖాల్లోనూ నేడు చిరునవ్వు కనిపిస్తోందని తెలిపారు. విశాఖలో జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సుతోపాటు వివిధ వేదికలపై ఏపీ అభివృద్ధి గురించి దేశవిదేశాల్లో చర్చ జరుగుతోందన్నారు.

ప్రజలు సంతోషంగా ఉండటాన్ని చూసి తట్టుకోలేని మానసిక స్థితిలో జగన్ ఉన్నారని, సొంత చెల్లి ఇంట్లో శుభకార్యం జరిగినా, మేనకోడలి పెళ్లి జరిగినా జీర్ణించుకోలేని పరిస్థితిలో ఉన్నారని విమర్శించారు. కేసులు, ఆస్తుల జప్తు కారణంగా పాస్‌పోర్టు కోర్టు పరిధిలో ఉన్నందున, కోర్టు అనుమతి తీసుకుని లండన్ వైద్యుడి వద్దకు తీసుకెళ్లి సరైన చికిత్స అందించాలని వైఎస్ భారతికి సూచించారు. 2024 ఎన్నికల్లో ప్రజలు ఏ ఆశయంతో కూటమికి పట్టం కట్టారో అవన్నీ నేడు సాకారమవుతున్నాయని పట్టాభిరామ్ తెలిపారు. రాష్ట్ర ప్రజల స్థితిగతులను మరింత మెరుగుపరిచేందుకు నిరంతరం శ్రమిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌కు భగవంతుడు మంచి ఆరోగ్యాన్ని, మరింత శక్తిని ప్రసాదించాలని ఆకాంక్షించారు.

జోన్ - 1 (శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అరకు)

చైతన్యరథం


తెదేపా ఆమదాలవలస మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థిగా కూన ప్రమీల



ఆమదాలవలస (చైతన్యరథం): శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మున్సిపాలిటీ చైర్మన్, వార్డు కౌన్సిలర్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. తెదేపా ఆమదాలవలస మున్సిపాలిటీ చైర్ పర్సన్ అభ్యర్థిగా కూన ప్రమీల, కౌన్సిలర్ అభ్యర్థులుగా మూడో వార్డు తమ్మినేని అనురాధ, 19 వ వార్డు మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తమ్మినేని గీతా విద్యాసాగర్, 15వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా బోయిన సునీత నామినేషన్ వేసేందుకు వెళ్లారు. ముందుగా అమదాలవలస గ్రామదేవత పాలపొలం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. నామినేషన్ పత్రంపై సంతకం చేసి నామినేషన్ వేసేందుకు ఆమదాలవలస మున్సిపల్ కార్యాలయానికి బయలుదేరారు. వారివెంట తెదేపా జిల్లా అధ్యక్షులు మొదలవలస రమేష్, ఆమదాలవలస జడ్పీటీసీ అభ్యర్థి తమ్మినేని సుజాతతోపాటు నాయకులు కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ఉన్నారు.

న్యాయవాదులకు అందుబాటులో డిజిటల్ వనరులు

మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్



విశాఖపట్టణం (చైతన్యరథం): న్యాయశాస్త్రంతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపైనా పట్టు సాధించాలని న్యాయ విద్యార్థులు, న్యాయవాదులకు మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సూచించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయ కళాశాల విశాఖ బీచ్‌రోడ్డులోని కన్వెన్షన్ హాలులో జస్టిస్ కె.రామస్వామి స్మారకోపన్యాస కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా 'డిజిటల్ యుగంలో న్యాయవాద వృత్తి-అవకాశాలు, సవాళ్లు' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌కు కోవింద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నిస్సహాయుల పక్షాన నిలబడుతూ, భయం లేకుండా సత్యాన్ని సమర్థిస్తూ, న్యాయ వెలుగులు అందరిపై ప్రకాశవంతంగా, సమానంగా ప్రసరించేలా చూడాలని న్యాయవిద్యార్థులు పిలుపునిచ్చారు. జస్టిస్ కె.రామస్వామి జీవిత ప్రయాణం, ఆయన చేసిన కృషి న్యాయ వ్యవస్థకు ముఖ్యమైన నైతిక దిక్సూచిగా నిలుస్తాయన్నారు. ప్రస్తుతం డిజిటల్ సాధనాలు, ఏఐ జీవితంలోని ప్రతి రంగాన్ని సమూలంగా మారుస్తున్నాయన్నారు. జిల్లా కోర్టులోని సాధారణ న్యాయవాదికి కూడా కార్పొరేట్ న్యాయవాదికి ఉన్నంత డిజిటల్ వనరులు అందుబాటులో ఉండేలా చూడాలని చెప్పారు. సాధారణ పౌరుడు కూడా ఈ డిజిటల్ న్యాయ వ్యవస్థను ఉపయోగించుకునేలా సాధికారిత కల్పించాలని సూచించారు. సాంకేతికతను ఆచరణాత్మకంగా ఉపయోగించి వర్ధమాన న్యాయవాదులను సిద్ధం చేయడం ద్వారా న్యాయ కళాశాలలు కూడా ఆధునికతను సంతరించుకోవాలని చెప్పారు. ఏయూ వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ, ఏయూలో చదువుకున్న జస్టిస్ కె.రామస్వామి అత్యున్నత న్యాయ స్థానాల్లో చారిత్రక తీర్పులను అందించిన న్యాయమూర్తిగా ఎందరికో ఆదర్శంగా నిలిచారన్నారు. జస్టిస్ రామస్వామి కుమారుడు, సీనియర్ ఐఏఎస్ అధికారి, భారత ప్రభుత్వ కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. కోవింద్ ఉపన్యాసం ఆంధ్ర వర్సిటీకి, పూర్వ, ప్రస్తుత విద్యార్థులకు, అధ్యాపకులకు గౌరవప్రదమైన విషయమన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ పులిపాటి కింగ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.రాంబాబు, అవుట్‌రీచ్ విభాగ డీన్ ప్రొఫెసర్ కె.రమాసుధ, ప్రిన్సిపాల్స్, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఏయూ న్యాయ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించే ప్రో బోన్ క్లబ్ (న్యాయ బంధు)ను రామ్‌నాథ్ కోవింద్ ప్రారంభించారు.



పంచాయతీ ఎన్నికల్లో నూరుశాతం ఫలితాలు సాధించాలి

ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు పిలుపు

రాజాం (చైతన్యరథం): రానున్న పంచాయతీ ఎన్నికల్లో ఐక్యంగా పనిచేసి నూటికి నూరు శాతం స్ట్రైక్ రేటు సాధించాలని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు సూచించారు. ఆయన రాజాంలోని తన నివాసంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. చీపురుపల్లి, గరివిడి మేజరు పంచాయతీలతో సహా మండలంలోని అన్ని పంచాయతీల్లో టీడీపీ మద్దతుదారులు గెలిచే విధంగా నాయకులు ప్రణాళికలు తయారు చేసుకోవాలని ఆయన సూచించారు. ఎక్కడా రాజీ పడకుండా ప్రతి పంచాయతీలోనూ గెలుపే ప్రధానంగా కార్యకర్తలు, నాయకులు పని చేయాలన్నారు. వార్డుల వారీగా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఏయే వార్డుల్లో ఎవరిని సభ్యులుగా నెలబెట్టాలన్న అంశంపై మాట్లాడుకోవాలని సూచించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, గవిడి నాగరాజు, ముల్లు రమణ, ఇజరోతు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చదువుల తల్లి విగ్రహావిష్కరణ

బొబ్బిలి (చైతన్యరథం): పట్టణంలోని తారకరామా కాలనీలోని పాఠశాలలో గుంప కృష్ణమూర్తి జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన సరస్వతీదేవి విగ్రహాన్ని శనివారం ఎమ్మెల్యే బేబీనాయన ఆవిష్కరించారు. అలాగే.. రూట్స్ అండ్ వింగ్స్ ట్రైబల్ ప్రాజెక్ట్‌లో భాగంగా ఉపాధ్యాయురాలు చిట్టిమోజు ఉషారాణి రూపొందించిన పుస్తకాన్ని కూడా ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో 35వ వార్డు కౌన్సిలర్ కల్యాణి, ఎంఈవోలు, తారకరామా కాలనీ, చిక్కాల రెల్లివీధి పెద్దలు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



ఏపీపై జగన్ కక్ష సాధింపు



ఎంపీ కలిశెట్టి ధ్వజం

వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తెలుగుదేశం పార్టీ విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రౌడీ మూకలను ప్రోత్సహించి, అల్లర్లు సృష్టించి ఎన్నికలను వాయిదా వేయాలని జగన్ రెడ్డి కుట్రలు పన్నారని ధ్వజమెత్తారు. అమరావతి వేదికగా మీడియాతో ఎంపీ కలిశెట్టి మాట్లాడారు. వైసీపీ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో దౌర్జన్యాలు, అక్రమాలు జరిగాయని, ఇప్పుడు ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయని ప్రజలు హర్షిస్తున్నారని చెప్పుకొచ్చారు. బెంగళూరు ప్యాలెస్‌లో జగన్ కూర్చొని ఏపీపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ, కుట్రలు చేస్తున్నారని ఆగ్రహించారు. తాడేపల్లి ప్యాలెస్‌కు చుట్టపు చూపుగా వచ్చి ప్రెస్‌మీట్లు పెడుతూ ప్రజలను జగన్ రెడ్డి గందరగోళానికి గురిచేస్తున్నారని ఎంపీ కలిశెట్టి దుయ్యబట్టారు. వైసీపీ కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని.. భవిష్యత్తులో ఏ ఎన్నికలు జరిగినా ప్రజలు ఓటుతో జగన్ అండ్ కోకు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. విశాఖపట్నంలో రెండు రోజుల పాటు జరిగిన సీఐఐ సదస్సు సూపర్ హిట్ అయిందని తెలిపారు. 31వ సీఐఐ సదస్సు ద్వారా ఏపీకి రూ.9.89 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చామని వెల్లడించారు. సీఎం చంద్రబాబు నాయుడు విజన్, మంత్రి లోకేశ్ కార్యాచరణపై నమ్మకంతోనే ఏపీకి దేశ, విదేశీ పారిశ్రామికవేత్తలు తరలివచ్చారని ప్రస్తావించారు. పీ4 కార్యక్రమం ద్వారా పేదల అభ్యున్నతికి తాము కృషి చేస్తున్నామని ఎంపీ కలిశెట్టి తెలిపారు. సీఎస్ఆర్ నిధులతో పేద కుటుంబాలను ఆదుకునేలా కార్పొరేట్ సంస్థలు ముందడుగు వేస్తున్నాయని వెల్లడించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి భోగాపురం ఎయిర్‌పోర్ట్, విశాఖపట్నం సదస్సులే గేట్‌వేనని చెప్పారు. జగన్ హయాంలోని ఐదేళ్లలో నిర్లక్ష్యానికి గురైన ఉత్తరాంధ్రకు నేడు పూర్వ వైభవం తీసుకువచ్చామని వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టులు తీసుకురావడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీలో కేంద్ర మంత్రుల చుట్టూ అవిశ్రాంతంగా తిరుగుతున్నారని ఎంపీ కలిశెట్టి అన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవానికి ముందు అల్లర్లు సృష్టించేందుకు వైసీపీ కుట్రలు చేసినా ప్రజలు తిప్పికొట్టారని చెప్పారు. గత ఐదేళ్లలో ప్రజాప్రతినిధులకు కనీసం ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ కూడా దొరకని పరిస్థితి ఉండేదని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు విమర్శించారు.

చైతన్యరథం

రాజమండ్రి మేయర్ కూటమి అభ్యర్థి రేలంగి శ్రీదేవి

కొలిక్కి వచ్చిన పురపాలక సీట్ల సర్దుబాట్ల వ్యవహారం



రాజమహేంద్రవరం (చైతన్యరథం): రాష్ట్రంలో రెండో దశ పురపాలక సంఘాల ఎన్నికలకు నగారా మోగింది. ఈ నేపథ్యంలో కూటమిలోని పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు వ్యవహారం ఆదివారం ఒక కొలిక్కి వచ్చింది. బీజేపీకి ఓ కార్పొరేషన్‌తోపాటు రెండు మున్సిపాలిటీలు ఇవ్వాలని టీడీపీ నిర్ణయించింది. దీంతో రాజమండ్రి కార్పొరేషన్, కావలి, బాపట్ల మున్సిపాలిటీలను ఆ పార్టీకి కేటాయించింది. రాజమండ్రి మేయర్ అభ్యర్థిగా రేలంగి శ్రీదేవి, కావలి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా గుండ్లపల్లి భరత్ కుమార్, బాపట్ల మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా ఇస్క సునీల్ కుమార్‌లను బీజేపీ ఎంపిక చేసింది. ఈ మేరకు ఏపీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ రెండో దశ పురపాలక సంఘాల ఎన్నికలను గ్రామ పంచాయతీ ఎన్నికలతోపాటు నిర్వహించనున్నారు. అయితే ఇప్పటికే రాష్ట్రంలో పలు నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీలకు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో కూటమిలోని పార్టీలు ఘన విజయం సాధించాయి. ఈ ఎన్నికల్లో అనంతపురం నగర పాలక సంస్థను బీజేపీకి కేటాయించారు. ఇక్కడ వైసీపీ మేయర్ అభ్యర్థి రమేశ్ గౌడ్ ఘన విజయం సాధించారు. దీంతో అనంతపురం నగరపాలక సంస్థ వైసీపీ ఖాతాలో పడింది. రాష్ట్రంలోని 23 పట్టణ స్థానిక సంస్థలలో కోర్టు కేసులు, వార్డుల పునర్విభజన, ఇతర సాంకేతిక కారణాల వల్ల ఎన్నికల నిర్వహణ ఆగిపోయింది. అందుకు సంబంధించిన కేసులు కోర్టులో ఇటీవల క్లియర్ అయ్యాయి. ఈ నేపథ్యంలో వీటికి ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో మొత్తం 123 పట్టన స్థానిక సంస్థలు ఉన్నాయి. వాటిలో 100 సంస్థలకు తొలి దశలో ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే.



వెంటాడుతున్న పెద్దపులి భయం

జంగారెడ్డి గూడెం (చైతన్యరథం): వేలేరుపాడు మండల అటవీ ప్రాంతం నుంచి గురువారం తెలంగాణలోకి ప్రవేశించిన పెద్దపులి మళ్లీ వెనక్కి వచ్చింది. అర్ధరాత్రి జీలుగుమిల్లి మండలం జిల్లేళ్ళగూడెం అడవిలోకి ప్రవేశించిన పులి శుక్రవారం తెల్ల వారుజామున అడవి సమీపంలోని పొలాల్లో కట్టేసి ఉన్న కుమ్మరి వెంకటేష్‌కు చెందిన ఎద్దుపై దాడి చేసి కొద్ది దూరం ఈడ్చుకెళ్లింది. ఎద్దు మెడ భాగం వద్ద రక్తం తాగి వెనుక భాగంలో గాయం చేసి కొంత మాంసం తిని వెళ్లినట్లు గిరి జనులు చెప్పారు. రెండు నెలల క్రితం మండలంలో పెద్దపులిని పట్టుకునేందుకు అటవీశాఖ అధికారులు విశ్వ ప్రయత్నాలు చేసి విఫలం అయ్యారు. అప్పట్లో స్వర్ణవారిగూడెం, దర్భగూడెం, అంకన్నగూడెం గ్రామాల మీదుగా సంచరించి బుట్టాయగూడెం మండలం కామవరం మీదుగా దట్టమైన గుబ్బలమంగమ్మ అడవి మీదుగా పాపికొండల అభయారణ్యంలోకి వెళ్లిపోయింది. ఈ క్రమం లో రెండు రోజులకోసారి పశువుల్ని చంపి తన ఆకల్ని తీర్చుకునేది. పశువుల మాంసంకు అలవాటు పడిన పెద్దపులి మనుషులకు ఎటువంటి హాని తలపెట్టకుండా రాత్రి సమయంలో సంచరిస్తూ పశువుల్ని చంపి తింటోందని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం జిల్లేళ్ళగూడెం, బొత్తప్పగూడెం సమీప సంగంవాగు ప్రాంతంలో మకాం వేసినట్టు అధికారులు చెప్పారు. సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాత్రి సమయంలో గ్రామాల్లో మంటలు వేసుకోవాలని, ఒంటరిగా సంచరించవద్దని చెబుతున్నారు.

చినకాకాని తెలుగుదేశం పార్టీలోకి భారీగా చేరికలు

మంత్రి నారా లోకేశ్ చేపట్టిన సంక్షేమాభివృద్ధికి మెచ్చి వైసీపీని వదిలేస్తున్నామని వెల్లడి

చినకాకాని (చైతన్యరథం): మంగళగిరి, తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 33వ డివిజన్ చినకాకానిలో తెలుగుదేశం పార్టీలోకి భారీగా చేరికలు జరిగాయి. నియోజకవర్గంలో మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమానికి ఆకర్షితులై మల్లవరపు సంగమేశ్వరరావు ఆధ్వర్యంలో 40 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. చినకాకానిలో నిర్వహించిన కార్యక్రమంలో గుంటూరు పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షులు పల్లబోతుల శ్రీనివాసరావు పార్టీ కండువాలు కప్పి మల్లవరపు సంగమేశ్వరరావు ఆధ్వర్యంలో వచ్చిన కుటుంబాలను పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.పార్టీలో చేరిన వారిలో మల్లవరపు సంజీవ్ కుమార్, మల్లవరపు రాజేష్, మల్లవరపు కళ్యాణ్ బాబు, మల్లవరపు అజయ్ కుమార్, మల్లవరపు సుధీర్, మల్లవరపు సునీల్, మల్లవరపు ఇస్సాకు, మల్లవరపు ధనరాజ్, మల్లవరపు వెంకయ్య, మల్లవరపు కోటేశ్వరరావు, మల్లవరపు నాగరాజు, నూతక్కి కోటేశ్వరరావు, నూతక్కి సుకుమార్, స్టీవెన్, నూతక్కి అన్నామణి, మల్లవరపు రాణి, కుక్కమళ్ళ నాగేశ్వరరావు, కుక్కమళ్ళ అజయ్, రాజు, మల్లవరపు గోపాలరావు, మల్లవరపు ఇమంజలి, మల్లవరపు అలేఖ్య, మల్లవరపు కుమారి, మల్లవరపు సరోజిని, మల్లవరపు సునీత, యాకోబు, హిమజ్యోతి, భాగ్యశ్రీ, నాగజ్యోతి తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు గుమ్మా హరిబాబు, కొనికపాక ప్రేమ్, కుక్కమళ్ళ శ్రీనివాసరావు, చాగర్లమూడి నరేంద్ర, పొన్నేకంటి సాంబశివరావు,గుర్రం నరసింహ రావు,ఓంకార్, బొర్ర శ్రీనివాసరావు, బళ్ళ విజయ్, ఏసురత్నం, కోటేశ్వరరావు, నాగమల్లేశ్వరరావు తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



విధ్వంసం నుంచి వికాసం వైపు పల్లె సీమలు



లింగాల (చైతన్యరథం): నలభై ఏళ్ల క్రితం పులివెందుల నియోజకవర్గం లింగాల మండలంలోని కామసముద్రం, రామాపురం, పెద్దకుడాల, తాతిరెడ్డిపల్లె, అంబకపల్లె, పార్నపల్లె, కర్ణపాపాయపల్లె, బోనాల, దొండవాగు, కోమన్నాతల, గుణకనపల్లె, రామన్నాతలపల్లె, దిగువపల్లె, మురారిచింతల వెలిదండ్ల ఫ్యాక్షన్ గ్రామాలుగా పేరొందాయి. 1960 నుంచి 1989 మధ్య ఇవి అధిపత్య పోరు, పాత కక్షలతో నిత్యం రణరంగాన్ని తలపించేవి. గొడవలు.. బాంబులు, తుపాకుల మోతతో ఊళ్లు వణుకుతుండేవి. వందల కేసులతో గ్రామీణులు సతమతం అవుతుండేవారు. పగా ప్రతీకారాలతో 50 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. 1985 మే 19న చోటుచేసుకున్న దాడులు, ప్రతిదాడులతో తాతిరెడ్డిపల్లెలోని 110 గృహాలు దహనమయ్యాయి. కక్షలతో ఎన్నో కుటుంబాలు భిన్నాభిన్నమయ్యాయి. రక్తపాతంతో గ్రామాభివృద్ధి ఆగిపోతోందని, భవిష్యత్తు తరాలకైనా ప్రశాంత జీవితం అందించాలన్న లక్ష్యం ఫ్యాక్షన్ నాయకుల్లో 1980 తర్వాత మొదలైంది. పులివెందుల ఏఏస్పీగా, జిల్లా ఎస్పీగా పనిచేసిన ఉమేష్‌చంద్ర చేపట్టిన బాంబులు, తుపాకుల ఏరివేతతో పాటు, పోలీసు శాఖ చేపట్టిన అవగాహన కార్యక్రమాలు ఆయా గ్రామాల్లోని నాయకుల్లో పరివర్తన తెచ్చాయి. క్రమేపీ విధ్వంసం వీడి ప్రగతి బాట వైపు ఊళ్లు మళ్లాయి. కత్తులకు బదులు పిల్లలతో పుస్తకాలను, ఆయుదాల స్థానంలో నాగళ్లను చేతబట్టించారు. పలువురు పంటల సాగు వైపు దృష్టి మళ్లించారు. దీంతో చీనీ, అరటి, దానిమ్మలతో తక్కువ సమయంలో ఆర్థికంగా కుదురుకున్నారు. ఒకప్పుడు బాంబుల మోతలు: వినిపించిన గ్రామాల్లో ఇప్పుడు పిల్లల చదువుల సందడి కనిపిస్తోంది. తల్లిదండ్రులు తమ పిల్లల విద్యకు ప్రాధాన్యం ఇస్తుండటంతో ఉన్నత చదువులు పూర్తిచేసి ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఖరీదైన ఉద్యోగాలు చేస్తున్నారు. ఫ్యాక్షన్ గ్రామాల్లోకి వెళితే ఖరీదైన భవంతులు, రెండు, నాలుగు చక్రాల వాహనాలు కనిపిస్తాయి. తమ వీధిలోకి రమ్మని చక్కటి సిమెంటు రోడ్లు ఆహ్వానిస్తుంటాయి. ఒకప్పటి ఫ్యాక్షన్ గ్రామాలు ప్రస్తుతం ఆదర్శంగా నిలుస్తున్నాయి.



రెండో విడతలోనూ కూటమిదే హవా

ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ధీమా



విజయవాడ (చైతన్యరథం): స్థానిక సంస్థల రెండో విడత ఎన్నికల్లో కూటమి విజయమే లక్ష్యమని ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ స్పష్టం చేశారు. గతంలో సాధించిన విజయాలను పునరావృతం చేసేలా ఈ ఎన్నికలకు సమాయత్తమవుతున్నామని తెలిపారు. ఆదివారం రాజధాని అమరావతిలో ఆయన మాట్లాడుతూ.. 2024 అసెంబ్లీ ఎన్నికలతోపాటు ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి ప్రజలు మద్దతు ఇచ్చారని అన్నారు. ఈ మద్దతు ఈసారి కూడా కొనసాగుతోందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాలనపై ప్రజల్లో సానుకూల స్పందనతోపాటు విశ్వాసం కూడా పెరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని పీవీఎన్ మాధవ్ చెప్పారు. అన్ని ప్రాంతాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నేతల సమన్వయంతో అభ్యర్థుల ఎంపిక, సీట్ల పంపకాలపై చర్చలు జరిపామని వివరించారు. పంచాయతీ ఎన్నికల మొదటి విడతకు కూడా ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైందని అన్నారు. జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలతో కలిసి క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించామని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి అనే రెండు అంశాలకు సమాన ప్రాధాన్యతను ఇస్తూ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఏపీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ ధీమా వ్యక్తం చేశారు.



తాడిగడపలో కూటమి అభ్యర్థుల నామినేషన్లు

పాల్గొన్న పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్

పెనమలూరు (చైతన్యరథం): తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో ఎన్నికల సందడి నెలకొన్న నేపథ్యంలో పలు డివిజన్లలో కూటమి అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే కార్యక్రమాలకు పెనమలూరు నియోజకవర్గ శాసనసభ్యుడు బోడే ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అభ్యర్థులతో కలిసి నామినేషన్ ప్రక్రియలో పాల్గొని, వారికి మద్దతు తెలియజేశారు, స్థానిక నాయకులు,పార్టీ శ్రేణులు, కార్యకర్తలతో సమావేశమై ఎన్నికలకు సంబంధించిన అంశాలపై చర్చించారు, డివిజన్ల వారీగా ఎన్నికల కార్యక్రమాలు,నామినేషన్ ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తాడిగడప నామినేషన్ కార్యక్రమాల్లో పాల్గొన్న బోడే వెంకట్ రామ్

పిల్లల కోసం ఉచిత సమగ్ర ఆరోగ్య పరీక్షల శిబిరం

కానూరు (చైతన్యరథం): బాలల దినోత్సవం 2026 సందర్భంగా విజయవాడ, కానూరులోని నాగార్జున హాస్పిటల్‌లో పుట్టినప్పటి నుంచి 14 ఏళ్ల వయసు వరకు ఉన్న పిల్లల కోసం ఉచిత సమగ్ర ఆరోగ్య పరీక్షల శిబిరం నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగిన ఈ శిబిరంలో 300 మందికి పైగా చిన్నారులు పాల్గొన్నారు. శిబిరంలో ప్రతి చిన్నారికి ఈ క్రింది పరీక్షలు ఉచితంగా నిర్వహించారు: పిల్లల వైద్య నిపుణులతో సంపూర్ణ శారీరక పరీక్ష, ఎదుగుదల పరిశీలన, ఎత్తు, బరువు కొలతలు, బీఎంఐ చార్ట్, స్కూలుకు వెళ్లే పిల్లలకు కంటి చూపు పరీక్ష, పళ, చిగుళ్ల దంత పరీక్ష, వేలి నుంచి రక్తం తీసి హిమోగ్లోబిన్ పరీక్ష, ఈసీజీ, ఎకో మరియు గుండె వైద్య నిపుణుల సంప్రదింపులు, పోషకాహార సూచనలు, టీకాల వివరాల పరిశీలన,చిన్నారుల కోసం బొమ్మలు గీసే పోటీ, బెలూన్లు, ఆరోగ్యకరమైన స్నాక్స్ ఏర్పాటు చేసి, ప్రతి చిన్నారికీ బహుమతి అందజేశారు. చిన్నారుల చిరునవ్వులతో ఆసుపత్రి ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా నాగార్జున హాస్పిటల్ చైర్మన్ ఁ మేనేజింగ్ డైరెక్టర్ డా. జగన్ మోహన్ రావు మాట్లాడుతూ, “పిల్లలే మన సమాజ భవిష్యత్తు. వారి ఆరోగ్యమే ఆ భవిష్యత్తుకు పునాది. రక్తహీనత, కంటి చూపు సమస్యలు, దంత సమస్యలు, ఎదుగుదల లోపాలు, గుండె సంబంధిత సమస్యలు చాలాసార్లు తీవ్రమయ్యే వరకు బయటపడవు. ప్రతి తల్లిదండ్రులకూ తమ చిన్నారిని నిపుణులైన వైద్యులతో ఉచితంగా పరీక్షించుకునే అవకాశం కల్పించాలనే ఈ శిబిరం నిర్వహించాం. 300 మందికి పైగా చిన్నారులు పాల్గొనడం ముందస్తు ఆరోగ్య పరీక్షలపై ప్రజల్లో పెరుగుతున్న అవగాహనకు నిదర్శనం. 34 ఏళ్లుగా విజయవాడ ప్రజలకు సేవలందిస్తున్న నాగార్జున హాస్పిటల్ ఇలాంటి కార్యక్రమాలను భవిష్యత్తులోనూ కొనసాగిస్తుంది” అని తెలిపారు. నాగార్జున హాస్పిటల్ సీఈఓ (జజూ) శ్రీ నితిన్ కొడాలి మాట్లాడుతూ, “ఒకే రోజు, ఒకే చోట పిల్లలకు అవసరమైన అన్ని ముఖ్యమైన పరీక్షలు అందించాలనేది మా లక్ష్యం. చూడీఎ గుర్తింపు పొందిన ఆసుపత్రిగా నాణ్యత, రోగి భద్రత ప్రమాణాలతో ఈ శిబిరాన్ని నిర్వహించాం. పరీక్షల్లో ఏవైనా సమస్యలు గుర్తించిన పిల్లలకు తదుపరి చికిత్స, సలహాల కోసం మా వైద్య బృందం అందుబాటులో ఉంటుంది. శిబిరం విజయవంతానికి కృషి చేసిన వైద్యులు, నర్సులు, సిబ్బంది, మరియు ఉత్సాహంగా పాల్గొన్న తల్లిదండ్రులకు, చిన్నారులకు ధన్యవాదాలు” అని అన్నారు.నాగార్జున హాస్పిటల్ సీఓఓ ధనిష్ట బత్తుల మాట్లాడుతూ, “300 మందికి పైగా చిన్నారులకు ఎక్కువ సేపు వేచి ఉండకుండా, ప్రతి పరీక్ష సురక్షితంగా, క్రమబద్ధంగా జరగేలా ముందస్తు రిజిస్ట్రేషన్, ప్రత్యేక కౌంటర్లు, పిల్లల స్నేహపూర్వక వాతావరణం ఏర్పాటు చేశాం. ప్రతి చిన్నారి పరీక్ష ఫలితాలను తల్లిదండ్రులకు వివరించి, అవసరమైన వారికి తదుపరి సంప్రదింపుల కోసం మార్గదర్శనం చేశామని అని తెలిపారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపు



గుంటూరు (చైతన్యరథం): డయాబెటిస్ పై ఏ మాత్రం నిర్లక్ష్యం వహించ వద్దని, చిన్న గాయం కనిపించినా వెంటనే వైద్యులను సంప్రదించాలని లేకపోతే అది కాలు తొలగించుకునే పరిస్థితులు రావచ్చని, కాబట్టి ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. ఆదివారం గుంటూరు కొరిటెపాడు వాకింగ్ ట్రాక్‌లో నిర్వహించిన జాతీయ రక్తనాళాల ఆరోగ్య అవగాహన వాకథాన్ కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి, నగర మేయర్ కోవెలమూడి లక్ష్మీ అపర్ణ పాల్గొన్నారు. డయాబెటిస్ కారణంగా కాళ్లు తొలగించాల్సిన పరిస్థితులు రాకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలనే లక్ష్యంతో వాస్కులర్ సర్జన్లు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ కాలు తొలగింపు లేని గుంటూరు, కాలు తొలగింపు లేని భారతదేశం లక్ష్యంగా గుంటూరులోని కార్యక్రమం అభినందనీయమని, డయాబెటిస్‌తో పాటు అనారోగ్యకరమైన జీవనశైలి, ఆరోగ్యంపై నిర్లక్ష్యం కారణంగా చాలామంది కాళ్లు తొలగించాల్సిన దుస్థితిని ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా డయాబెటిస్ ఉన్నవారు కాళ్ల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, చిన్న గాయం అయినా, ఏదైనా ఇబ్బంది తలెత్తినా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను, ముఖ్యంగా రక్తనాళాల శస్త్రచికిత్స నిపుణులను సంప్రదించాలని సూచించారు. వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించకపోవడం కూడా సమస్య తీవ్రతకు కారణమవుతోందని పేర్కొన్నారు.

డయాబెటిస్ సమస్య విస్తృతంగా పెరుగుతున్న నేపథ్యంలో, బాధితుల్లో కొందరు కాలు తొలగించాల్సిన పరిస్థితులకు చేరుకుంటున్నారని తెలిపారు. సకాలంలో వైద్య పరీక్షలు, సరైన చికిత్స, ఆరోగ్యంపై అవగాహన ఉంటే ఇటువంటి పరిస్థితులను నివారించవచ్చని చెప్పారు. కాలు కోల్పోవడం వల్ల వ్యక్తి తన దైనందిన జీవితంలో ఇతరులపై ఆధారపడాల్సి వస్తుందని, అది వారి ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసంపై ప్రభావం చూపుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని మహాభాగ్యంగా భావించి కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షిస్తున్న సంతోషకరమైన, ఆరోగ్యకరమైన, సంపన్నమైన కుటుంబాల నిర్మాణంలో భాగంగా ప్రజలందరూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని కోరారు. లికాలు తొలగింపు లేని గుంటూరు.. కాలు తొలగింపు లేని భారతదేశంలి లక్ష్యాన్ని సాకారం చేసేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

జోన్-4

(ఒంగోలు, నెల్లూరు, రాజంపేట, తిరుపతి, చిత్తూరు)

చైతన్యరథం

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన చరిత్ర వైసీపీదే

సీఎం చంద్రబాబును విమర్శించే నైతిక హక్కు సుధాకర్‌బాబుకు లేదు : డాక్టర్ నూకసాని బాలాజీ ధ్వజం



ఒంగోలు (చైతన్యరథం): వైసీపీ నేత టీజేఆర్ సుధాకర్‌బాబు తన స్థాయిని మరిచి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై అవాకులు చవాకులు పేలడం ఆయన రాజకీయ అజ్ఞానానికి, కుసంస్కారానికి నిదర్శనమని తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ నూకసాని బాలాజీ ధ్వజమెత్తారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాజ్యాంగ వ్యవస్థలను మంటగలిపి, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసి, ఎన్నికల ప్రక్రియను ఒక ప్రహసనంగా మార్చిన ఘనత మీ ప్రభుత్వానిదేనన్నారు. ప్రతిపక్ష అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేసి, నామినేషన్లు వేయనీయకుండా అడ్డుకుని, అధికార యంత్రాంగాన్ని రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకున్న చరిత్ర వైసీపీ నేతలదేనని విరుచుకుపడ్డారు. అలాంటి మీరు ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. గత రెండేళ్లుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజలు ఆకర్షితులై తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమికి అండగా నిలుస్తున్నారు. నిన్న జరిగిన ఎన్నికల్లో ప్రజలు కూటమికి ఇచ్చిన మద్దతు దీనికి స్పష్టమైన నిదర్శనం. ఈ ప్రజా మద్దతును చూసి ఓర్వలేకనే వైసీపీ నేతలు అసత్య ఆరోపణలకు దిగుతున్నారన్నారు. గత ఐదేళ్లలో ప్రజలకు దూరమై, ప్రజల తిరస్కారానికి గురై, కేవలం 11 అసెంబ్లీ స్థానాలకే పరిమితమైన వైసీపీ నేతలు ఇప్పటికైనా ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. ప్రజలు ఎందుకు మిమ్మల్ని తిరస్కరించారో తెలుసుకోవాలని హితవు పలికారు. కానీ, ఇంకా బుద్ధి తెచ్చుకోకుండా ప్రజాదరణ పొందుతున్న ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేయడం మీ రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. ప్రజలకు ఏ ప్రభుత్వం కావాలో, రాష్ట్ర అభివృద్ధికి ఎవరు కృషి చేస్తున్నారో, ప్రజా సంక్షేమానికి ఎవరు కట్టుబడి ఉన్నారో ప్రజలకు స్పష్టంగా తెలుసు. అందుకే కూటమి ప్రభుత్వానికి తమ సంపూర్ణ మద్దతును తెలియజేస్తున్నారు. ఈ వాస్తవాన్ని జీర్ణించుకోలేక చంద్రబాబుపై వ్యక్తిగత విమర్శలు చేయడం మానుకోవాలన్నారు. గురివింద గింజ తన నలుపు తాను ఎరుగనట్లు, మీ ఐదేళ్ల పాలనలో జరిగిన నిర్వాకాలను మరిచి చంద్రబాబును విమర్శించడం మీ ద్వంద్వ వైఖరికి నిదర్శనం. ఇకనైనా వైసీపీ నేతలు పిచ్చి ప్రేలాపనలు, నిరాధార ఆరోపణలు, వ్యక్తిగత విమర్శలు మానుకోవాలన్నారు. ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే ముందు మీ ఐదేళ్ల అరాచక పాలనను ఒకసారి గుర్తు చేసుకోండి. అధికారం శాశ్వతం కాదని, ప్రజలే అంతిమ న్యాయనిర్ణేతలని తెలుసుకోండి. చంద్రబాబు నాయుడు గారి నాయకత్వాన్ని కించపరిస్తే సహించేది లేదని స్పష్టం చేస్తున్నాను. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవాలని చూసినా, ప్రజలను తప్పుదోవ పట్టించాలని ప్రయత్నించినా తెలుగుదేశం పార్టీ శ్రేణులు ప్రజాక్షేత్రంలో ధీటుగా ఎదుర్కొంటాయి. మీ అసత్య ప్రచారాలకు సమాధానం మా అభివృద్ధి పనులు చెబుతాయి. మీ అహంకారానికి సమాధానం ప్రజల తీర్పు చెబుతుందని హెచ్చరించారు. ప్రజలు ఒక్కసారి తిరస్కరించారంటే అది హెచ్చరిక. పదేపదే అదే తప్పులు చేస్తే రాజకీయ ఉనికే ప్రశ్నార్థకమవుతుందన్నారు. ఇకనైనా నోరు అదుపులో పెట్టుకుని, ప్రజాస్వామ్య విలువలను గౌరవించి, నిర్మాణాత్మక రాజకీయాలు చేయాలన్నారు. లేకపోతే రాబోయే ప్రతి ఎన్నికలో ప్రజలే మీకు తగిన గుణపాఠం చెబుతారన్నారు.



స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఈ రోజు ప్రకాశం జిల్లా కలెక్టర్ పి.రాజాబాబును కలిసి తెలుగుదేశం పార్టీ ఫారమ్ ఏ కాపీలను ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు, కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అందజేశారు.

శ్రీకాళహస్తి చైర్మన్ అభ్యర్థిగా పేట బాలాజీ!

మునిసిపల్ ఎన్నికల్లో ముమ్మర కసరత్తు



శ్రీకాళహస్తి (చైతన్యరథం): శ్రీకాళహస్తి పురపాలక ఎన్నికలకు సంబంధించి తొలి రోజు 17 నామినేషన్లు దాఖలయ్యాయి.చైర్మన్ స్థానానికి సీపీఎం తరపున ఒక నామినేషన్,వార్డు కౌన్సిలర్ల స్థానాలకు టీడీపీ తరపున 5, బీజేపీ నుంచి 3, వైసీపీ నుంచి 7, సీపీఎం నుంచి ఒక నామినేషన్ చొప్పున దాఖలైనట్లు కమిషనర్ కేవీ కృష్ణారెడ్డి వెల్లడించారు. ఆర్డీవో భాను ప్రకాశ్‌రెడ్డి డీఎస్పీ పావని నామినేషన్ల ప్రక్రియను పర్యవేక్షించారు. శ్రీకాళహస్తి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి విషయంలో ఇంకా ఉత్కంఠ వీడలేదు. చైర్మన్ స్థానాన్ని బీసీ జనరల్‌కు కేటాయించిన విషయం తెలిసిందే. కూటమి సీట్ల సర్దుబాటులో భాగంగా చైర్మన్ స్థానం టీడీపీకి లభించింది. టీడీపీలో బలమైన నాయకుల నుంచి పెద్దఎత్తున పోటీ నెలకొంది. దీంతో పార్టీ అధిష్ఠానం వివిధ సమీకరణాలను పరిశీలిస్తూ సమర్థవంతమైన అభ్యర్థిని ఎంపిక చేసేందుకు మూడురోజుల నుంచి ఐవీఆర్ఎస్ సర్వే చేపట్టింది. మొదట నలుగురి పేర్లతో సర్వే నిర్వహించింది.తరువాత అందులో నుంచి రెండుపేర్లతో శనివారం మరోదఫా సర్వే నిర్వహించింది.అయితే అభ్యర్థి ఎవరన్నది తెలియలేదు. టీడీపీ నుంచి అభ్యర్థి ఖరారు కాకపోవడంతో వైసీపీ కూడా తమ అభ్యర్థి వేటను కొనసాగిస్తూనే ఉంది.



పుల్లలచెరువు మండలంలో పంచాయతీ ఎన్నికలకు టీడీపీ సంసిద్ధం

యర్రగొండపాలెం (చైతన్యరథం): పట్టణం లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పుల్లలచెరువు మండలంలోని 19 గ్రామ పంచాయతీలకు చెందిన ముఖ్య నాయకులతోయర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరిక్సన్ బాబు సమావేశమయ్యారు. పంచాయతీ ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలతో, స్థానిక పరిస్థితులు, ప్రజాభిప్రాయం, వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని అభ్యర్థుల ఎంపిక జరిగినది. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ, పంచాయతీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు.



సుగవాసికి అభినందనల సునామీ

గాలివీడు (చైతన్యరథం): జడ్పీటీసీ ఎన్నికల్లో రాష్ట్రస్థాయిలో రికార్డు మెజారిటీతో అఖండ విజయాన్ని సాధించిన రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, మాజీ టీటీడీ పాలకమండలి సభ్యుడు సుగవాసి ప్రసాద్ బాబును తంబళ్లపల్లె నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గాలివీడు ప్రజలు అందించిన చారిత్రాత్మక విజయంపై హర్షం వ్యక్తం చేస్తూ, ప్రసాద్ బాబు గారికి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ విజయం ఆయనపై ప్రజలకు ఉన్న అపారమైన అభిమానం, నమ్మకానికి నిదర్శనమని కొనియాడారు. తనను కలిసిన తంబళ్లపల్లె నాయకులు, కార్యకర్తలు, అభిమానులను ప్రసాద్ బాబు ఆత్మీయంగా పలకరించి, అభినందనలు స్వీకరించారు. తన విజయానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ నిరంతరం ప్రజాసేవకు కృషి చేస్తానని పేర్కొన్నారు.



కార్యకర్తల జోలికొస్తే ఊరుకునే ప్రసక్తి లేదు : మంత్రి మండిపల్లి హెచ్చరిక



రామాపురం (చైతన్యరథం): కార్యకర్తల జోలికి వస్తే చూస్తూ ఊరుకునే ప్రసక్తి లేదని, వారి తాట తీస్తామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హెచ్చరించారు. రామాపురంలోని స్థానిక తెదేపా కార్యాలయంలో ఆదివారం సాయంత్రం మంత్రి విలేకరులతో మాట్లాడారు. మాజీ శాసనసభ్యుడు శ్రీకాంత్ రెడ్డి శిఖండి రాజకీయాలు చేస్తూ వైకాపా కార్యకర్తలను రెచ్చగొట్టి.. తెదేపా కార్యకర్తలపై దాడి చేయిస్తున్నారని అన్నారు. కార్యకర్తలపై కాదు ప్రజా క్షేత్రంలో తనతో తేల్చుకోవాలని సవాలు విసిరారు. సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో తొలి రోజు నామినేషన్లు దాఖలు చేసే సమయంలో రామాపురం, రాయచోటి మండలంలో తెదేపా కార్యకర్తలపై పోలీసులు, వైకాపా కార్యకర్తలు దాడికి పాల్పడ్డారని మంత్రి అన్నారు. తెదేపా కార్యకర్తల పైన దాడి చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు.



వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీలోకి..

ఎమ్మెల్యే కందికుంట సమక్షంలో చేరిన పెద్దతండా నాయకులు

కదిరి (చైతన్యరథం): గాండ్లపెంట మండలం పెద్దతండాకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంద్రావత్ కృష్ణ నాయక్, వస్రం నాయక్, మంగే నాయక్ తదితరులు వైఎస్సార్‌సీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. కదిరి పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో కదిరి నియోజకవర్గ శాసనసభ్యుడు కందికుంట వెంకటప్రసాద్ సమక్షంలో వారు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

విద్యార్థులకు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పిలుపు



కర్నూలు (చైతన్యరథం): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత అన్నారు. డాక్టర్స్ కాలనీలో ఏర్పాటు చేసిన ఏసీఈ బ్యాడ్మింటన ఏరియా కోర్టును పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డితో కలిసి మంత్రి టీజీ భరత ప్రారం భించారు. మంత్రి టీజీ భరత మాట్లాడుతూ నగరంలో ఇంత మంచి బ్యాడ్మింటన కోర్టు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. బ్యాడ్మింటన కోర్టును ఏర్పాటు చేసిన నిర్వహకులు జనార్దన, ఇమాని యేలు, రాజే ష్‌లను మంత్రి అభినందించారు. కార్యక్రమంలో 26, 32వ వార్డుల కార్పొరేటర్లు రాఘవేంద్ర రెడ్డి, శ్రీధర్, ఐటీడీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు గట్టు తిలక్ పాల్గొన్నారు. పతకాలు సాధించడం గర్వకారణం: స్కాట్లాండ్‌లో నిర్వహించిన 12వ కామనవెల్త్ కరాటే చాంపియనషిప్-2026లో కర్నూలు చెందిన క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయి ప్రతిభ కనబరిచి పతకాలు సాధించడం ఎంతో గర్వకారణమని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత అన్నారు. స్థానిక అవుట్‌డోర్ స్టేటియంలో నిర్వహించిన అభినందన సభలో ఆయన విజేతలను సత్కరించారు. మంత్రి మాట్లాడుతూ కామనవెల్త్ కరాటే చాంపియన షిప్‌లో భారతదేశం మొత్తం 23 పతకాలు సాధించగా.. అందులో ఆంధ్రప్రదేవ్‌కు మూడు పతకాలు లభించాయనీ ఇందులోనూ కర్నూలు చెందిన హేమంతకుమార్ రెడ్డి గోల్డ్ మెడల్ సాధించడం ఎంతో గర్వకారణమన్నారు. అలాగే మరో క్రీడాకారుడు దినేష్ బ్రౌంజ్ మెడల్ సాధించారన్నారు. అనంతరం కరాటే కోచ పి.జగ దీష్ కుమా ర్‌ను మంత్రి అభినందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గాజుల విజయభాస్కర్ రెడ్డి, సురేంద్ర, కరాటే మాస్టర్స్ హరీష్, గౌస్ బాషా, రమణ, ఫయాజ్, మునాఫ్, రాంబాబు, సురేంద్ర, చిన్న పాల్గొన్నారు.

సర్పంచ్ ఎన్నికల్లో కూటమి విజయమే లక్ష్యం

అభ్యర్థుల ఎంపికపై ఎమ్మెల్యే అశోక్ రెడ్డి ముమ్మర కసరత్తు

గిద్దలూరు (చైతన్యరథం): పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాబోయే సర్పంచ్ ఎన్నికలను పురస్కరించుకొని గిద్దలూరు నియోజకవర్గ పరిధిలోని గ్రామ పంచాయతీలకు అభ్యర్థుల ఎంపికపై గౌరవ ఎమ్మెల్యే శ్రీ ముత్తుముల అశోక్ రెడ్డి గారి ఆధ్వర్యంలో ముమ్మర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని కూటమి నాయకులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. గ్రామాల వారీగా రాజకీయ పరిస్థితులు, పార్టీ బలాబలాలు, ప్రజాభిప్రాయం, అభ్యర్థుల గెలుపు అవకాశాలపై ఎమ్మెల్యే నాయకులతో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ రెడ్డి గారు మాట్లాడుతూ.. కూటమి ఐక్యతను కాపాడుకుంటూ ప్రతి గ్రామంలో సమన్వయంతో ముందుకు సాగాలని, ప్రజల విశ్వాసం కలిగిన సమర్థులైన అభ్యర్థులను ఎంపిక చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకు చేరవేస్తూ, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు.

కూటమి పాలనలో సంక్షేమాభివృద్ధికి మెచ్చి...

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీ వలసలు : మంత్రి మండిపల్లి

రాయచోటి (చైతన్యరథం): లక్కిరెడ్డిపల్లెకు చెందిన వైసీపీ నేత, మాజీ ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు, అనుచరులు కలిసి సుమారు 200 కుటుంబాలు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. సుదర్శన్‌రెడ్డి స్వగృహంలో వారు టీడీపీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ మున్సిపల్, పరిషత్ ఎన్నికల్లో రాష్ట్రంలో 90శాతం విజయాలు సాధించామన్నారు. గడిచిన రెండున్నరేళ్లలో ఎంతో అభివృద్ధి చేశామని పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేశామని తెలిపారు. ఇవన్నీ చూసే ఇతర పార్టీల నుంచి నాయకులు తమ పార్టీలోకి వస్తున్నారని పేర్కొన్నారు. టీడీపీలో ప్రతి కార్యకర్తకూ గుర్తింపు ఉంటుందన్నారు. 2004 నుంచి సుదర్శన్‌రెడ్డి రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారని, అలాంటి వ్యక్తి తమ పార్టీలోకి రావడం సంతోషంగా ఉందని కొనియాడారు. స్థానిక ఎన్నికల్లో మండలంలోని 16 పంచాయతీల్లో టీడీపీ జెండా ఎగురవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి మున్సిపల్ చైర్మన్‌గా ఏకగ్రీవమైన ఖాదర్‌వల్లి, జడ్పీటీసీగా ఎన్నికైన మదనమోహన్, రాష్ట్ర అటవీ శాఖ డైరెక్టర్ రెడ్డి యాదవ్, మాజీ ఎంపీపీ రెడ్డెయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి జయరాం, టీడీపీ మైనార్టీ సెల్ నియోజకవర్గ జనరల్ సెక్రటరీ ఆరీఫ్, మార్కెట్ యార్డు చైర్మన్ షఫీనాయక్, టీడీపీ సీనియర్ నేతలు పాపయ్య, వెంకటరామరాజు పాల్గొన్నారు.





తిరోగమనంలో వైసీపీ ప్రస్థానం

గుడివాడ (చైతన్యరథం): అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర ఓటమి తర్వాత వైసీపీకి వరుసగా షాకుల మీద షాకులు తగులుతున్నాయి. ఇటీవల నిర్వహిస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల వేళ ఆ పార్టీకి గట్టి షాక్‌లు కొడుతున్నాయి. తాజాగా కృష్ణాజిల్లా గుడివాడలో వైసీపీకి గట్టి షాక్ తగిలింది. కృష్ణాజిల్లా వైసీపీ మైనార్టీ సెల్ మాజీ అధ్యక్షుడు మహ్మద్ ఖాసిం అలియాస్ అబూ ఆదివారం టీడీపీలో చేరారు. ఆయనతోపాటు దాదాపు 250 మంది అనుచరులు వైసీపీకి రాజీనామా చేసి.. టీడీపీలో చేరారు. కుండువా కప్పి వారందరిని పార్టీలోకి స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాముతోపాటు మాజీ మంత్రి పిన్నమనేని వేంకటేశ్వరరావు ఆహ్వానించారు.

గుడివాడ అభివృద్ధి చూసే తాము టీడీపీలోకి వచ్చామని ఈ సందర్భంగా అబూ ప్రకటించారు. మైనార్టీ షాదీఖానాకు రూ. 2 కోట్లు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే రాముకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గుడివాడ అభివృద్ధిలో భాగస్వామ్యం అవ్వాలనుకునే వారిని పార్టీలోకి ఆహ్వానిస్తామని ఎమ్మెల్యే రాము చెప్పారు.

పరిషత్ ఎన్నికల్లో ప్రవాసాంధ్రుల ఓటు

గల్ఫ్: అనేక మంది గల్ఫ్ ప్రవాసాంధ్రులు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు వేయడానికి ఆసక్తి ప్రదర్శించారు. శాసనసభ, లోక్‌సభ ఎన్నికలలో గతంలో ఓటు వేసినప్పటికీ ఈసారి సొంత ఊరి ఎన్నికలలో ఓటు వేయడం ఒక గొప్ప అనుభూతి కలిగించిందని సౌదీ అరేబియాలో పనిచేసే కృష్ణా జిల్లా కంకిపాడు మండలం ఈడుపుగల్లు గ్రామానికి చెందిన రాజశేఖర్ చెన్నుపాటి తెలిపారు. గురువారం ఉదయం ఆయన స్వగ్రామంలో ఓటు వేసిన అనంతరం గల్ఫ్ ప్రవాసాంధ్రులకు ఒక వీడియో సందేశం పంపారు. స్థానిక సంస్థల ఎన్నికలలో విధిగా ఓటుహక్కును వినియోగించుకునేందుకు స్వదేశానికి రావాలని కోరారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలోని ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి చేస్తున్న కృషికి కృతజ్ఞతగా తెలుగుదేశం మద్దతుదారులను గెలిపించాలని కోరారు.

–బతుకుదెరువు కోసం ఒమాన్‌లో ఉంటున్నా తమ మనస్సు మొత్తం గ్రామంలో నివసిస్తుందని ఒమాన్‌లో ఆయిల్ గ్యాస్ రంగంలో పని చేసే చిత్తూరు జిల్లా ఐరాల మండలం భీమనేని వారిపల్లి గ్రామానికి చెందిన వడ్లపట్ల మురళి తెలిపారు. ఒమాన్‌లో ఉండే మరో ముగ్గురు సంపతి పయ్యాల, యౌశిక చౌదరి, ఢిల్లీ బాబు లతో కలిసి వెళ్లి ఆయన గురువారం తమ స్వగ్రామంలో ఓటు వేశారు.



– ఓటు హక్కును వినియోగించుకోవడానికి తాను స్వదేశానికి చేరుకున్నప్పటికీ తుఫాన్ కారణంగా బెంగుళూరు నుంచి మార్కాపురంలోని తమ ఊరికి వెళ్లలేకపోయానని సౌదీ అరేబియాలో నివసిస్తున్న ప్రవాసాంధ్రురాలు శిల్పా గడ్డం తెలిపారు.

– అన్నమయ్య జిల్లాలోని అన్ని పురపాలక ఎన్నికలలో క్రియాశీలకంగా వ్యవహరించిన గల్ఫ్‌లోని ప్రవాసీయులు గురువారం గాలివీడు, సండుపల్లి, పుల్లంపేట మండలాలో పరిషత్ ఎన్నికలలో హడావుడి చేశారు. కువైట్‌లో తమ ఉద్యోగాలకు సెలవు పెట్టి గొర్లముదివీడు గణేశ్, ఖాద్రూన్ షేక్‌లు గాలివీడులో మకాం వేశారు.

– తెలుగుదేశం పార్టీని మూడంచెల వరకూ స్థానిక స్థాయిలో బలోపేతం చేయడం నిజమైన అభివృద్ధి అని తెలుగుదేశం పార్టీ గల్ఫ్ ప్రవాసాంధ్ర నాయకుడు జానీ బాషా చెప్పారు.

– ఖతార్ నుంచి తన భార్య శ్రీలక్ష్మి, కుమార్తె శ్రావ్యలు ఒంగోలు కార్పొరేషన్ ఎన్నికలలో ప్రత్యేకించి ఓటు వేయడానికి వెళ్లి వచ్చారని తెలుగుదేశం పార్టీ నాయకుడు గొట్టిపాటి రమణ వెల్లడించారు.

– ఉద్యోగం రీత్యా తాము ప్రత్యక్షంగా ఎన్నికల ప్రచారానికి వెళ్లలేకపోయినా వీలైన విధంగా అన్ని రకాలుగా కూటమి అభ్యర్థులకు మద్దతు ఇచ్చామని సౌదీ అరేబియాలోని జనసేన పార్టీ నాయకులు దుగ్గరపు ఎర్రన్న, యాకూబ్ ఖాన్‌లు వివరించారు. కూటమి ధర్మ కర్తవ్యాన్ని తాము నిజాయతీగా నిర్వర్తించామని జనసేన నాయకులు కేసరి త్రిమూర్తులు, చందక రాందాస్‌లు చెప్పారు.

చరిత్ర సృష్టించిన నిత్యా రామన్

◆ లాస్ ఏంజెల్స్ మేయర్ రేసులో విజయం




అమెరికా మధ్యంతర ఎన్నికల నేపథ్యంలో ప్రస్తుత మేయర్ కారెన్ బాస్‌ను ఓడించి లాస్ ఏంజిల్స్ మేయర్ ఎన్నికల్లో నిత్యా రామన్ విజయం సాధించారు. దీంతో ఆ నగరానికి మొట్టమొదటి ఆసియా– అమెరికన్ మేయర్‌గా ఖ్యాతి కెక్కారు. నగర స్థాయి అత్యున్నత పదవికి ఎన్నికైన రెండవ మహిళ కూడా ఆమెనే. కేరళలో జన్మించి అమెరికాలో స్థిరపడిన నిత్యా రామన్ అరుదైన రాజకీయ ఘనతనే సాధించారు. లాస్ ఏంజెలెస్ మేయర్ ఎన్నికల్లో 51.1 శాతం ఓట్లు సాధించి విజయాన్ని అందుకున్నారు. ప్రస్తుత మేయర్ కరెన్ బాస్‌కి 48.33 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. డెసిషన్ డెస్క్ హెచ్ క్యూ ఎన్నికల అంచనాల ప్రకారం నిత్యా రామన్ విజయం ఖాయమై పోయింది. దీంతో ఆమె లాస్ ఏంజెలెస్‌కి 44వ మేయర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. నిత్యా మీనన్ 1981లో కేరళలో జన్మించారు. ఆ తర్వాత అమెరికాకి వలస వెళ్లింది కుటుంబం. 22 ఏళ్ల వయసులోనే అమెరికా పౌరసత్వం పొందారు. హార్వర్డ్ యూనివర్సిటీలో డిగ్రీ పూర్తి చేసిన ఆమె.. మసాచుసెట్స్ ఇనిస్టి ట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి అర్బన్ ప్లానింగ్‌లో మాస్టర్స్ డిగ్రీ పొందారు. గతంలో సామాజిక సమస్యల పరిష్కారంపై కూడా పనిచేశారు. లాస్ ఏంజెలెస్ రాజకీ యాల్లో నిత్యా రామన్‌కి అనుభవం ఉంది. 2020లో తొలిసారిగా రాజకీయాల్లోకి వచ్చారు. అప్పటి సిట్టింగ్ సిటీ కౌన్సిల్ సభ్యుడు డేవిడ్ ర్యూను ఓడించారు. మొత్తానికి అనేక విమర్శలు వ్యక్తమైనా రేసులో విజయం సాధించి సత్తా చాటారు. విజయం సాధించిన సందర్భంగా ఆమెకు అభినందనలు తెలుపుతున్నారు.

చిత్రదుర్గలోని ఎస్‌జేఎంఐటీ పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమావేశం అమెరికా లాస్‌వెగాస్ నగరంలో ఘనంగా జరిగింది. కళాశాలతో అనుబంధం ఉన్న 200 మంది పాల్గొన్నారు. ఈ ఆత్మీయ కలయికకు వెనిగళ్ల రవికుమార్ చొరవ తీసుకున్నారు.



హౌతీల దాడిలో గాయపడ్డ

తెలంగాణ వాసి మృతి



సౌదీ అరేబియా: రాజధాని రియాద్‌లోని కింగ్ ఖాలీద్ అంతర్జాతీ య విమానాశ్రయంపై గతనెలలో హౌతీలు జరిపిన దాడిలో... తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న తెలంగాణకు చెందిన వ్యక్తి మృతిచెందినట్లు బుధవారం భారత ఎంబసీ ప్రకటించింది. కామారెడ్డిలోని సైలానిబాబా కాలనీకి చెందిన షేక్ సయీద్ (40) అక్టోబరు 10న రియాద్ ఎయిర్‌పోర్ట్‌లోని ప్రఖ్యాత కాఫీ షాపులో పనిచేస్తుండగా హౌతీలు చేసిన దాడులలో తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గత మంగళవారం మరణించాడు. రియాద్ నగరంలో అంత్యక్రియలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. మృతుడి ఇద్దరు సోదరులు కూడా సౌదీలోనే పని చేస్తున్నారు. సయీద్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. దాడి జరిగినప్పటి నుంచి ఎయిర్‌పోర్టును తాత్కాలికంగా మూసివేయడంతో భారత్ నుంచి మృతుడి కుటుంబసభ్యులు రాలేక పోయారు.

అమెరికాలో తెలంగాణ విద్యార్థిని అదృశ్యం



అమెరికా: భారత్‌కు చెందిన విద్యార్థిని అమెరికాలో అదృశ్యమైంది. మసాచుసెట్స్ రాష్ట్రంలోని బోస్టన్‌లో ఉంటున్న శ్రీజ కోయ (23) నవంబరు 3 నుంచి కనిపించడం లేదు. నవంబరు 2 సాయంత్రం తన నివాసం నుంచి బయలుదేరుతుండగా చివరిసారి కనిపించినట్లు సమాచారం. విద్యార్థి వీసాపై ఉన్న శ్రీజ తెలంగాణకు చెందిన అమ్మాయిగా తెలుస్తోంది. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన బోస్టన్ పోలీసులు శ్రీజ ఆచూకీ కోసం ముమ్మర గాలింపు చేపట్టారు. ఆమెకు సంబంధించిన ఏమైనా సమాచారం ఉంటే తెలియజేయాలని స్థానికులకు పోలీసులు విజ్ఞప్తి చేశారు.

హ్యూస్టన్‌లో జన జాతీయ దివస్

అమెరికా: హ్యూస్టన్‌లోని షుగర్ ల్యాండ్‌లో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం, జన జాతీయ గౌరవ దివస్ జరుపుకున్నారు. ఇందులో వివిధ ప్రవాస సంఘాలు పాల్గొన్నాయి. హ్యూస్టన్‌లోని భారత కాన్సులేట్ జనరల్, ప్రవాస సంఘాల సహకారంతో శ్రీ కృష్ణ వృందావన హాల్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇది ప్రాంతీయ గుర్తింపులను ఒకచోట చేర్చి, తాము ఒక సమూహానికి చెందినవారమనే భావనను పంచుకుంది. భారతదేశపు విభిన్న ప్రాంతీయ మరియు సాంస్కృతిక సంప్రదాయాలకు చెందిన ప్రవాస సంస్థలను అనుసంధానించే ప్రయత్నంగా ఈ వేడుకను రూపొందించారని, ఇందులో ఐక్యతకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని హ్యూస్టన్‌లోని భారత కాన్సులేట్ జనరల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కర్ణాటక, ఉత్తరప్రదేశ్, ఆంధ్ర ప్రదేశ్, గుజరాత్, ఉత్తరాఖండ్, అస్సాం, పంజాబ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, కేరళ, తెలంగాణ, జార్ఖండ్, బీహార్ రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఈ స్ఫూర్తికి జీవం పోశాయి. నవంబరు 15న జరుపుకునే జనజాతియ గౌరవ్ దివస్‌కు ముందు జరిగిన ఈ కార్యక్రమంలో, భగవాన్ బిర్సా ముండా




కు, గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల శౌర్యానికి, త్యాగాలకు నివాళులర్పించారు. ముండా ప్రస్తుత జార్ఖండ్ రాష్ట్రానికి చెందినవారు. "ధర్తీ అబా"గా పూజించబడే ఆయన 19వ శతాబ్దం చివరలో దోపిడీకి గురిచేసే బ్రిటిష్ వలస పాలన, భూస్వామ్య వ్యవస్థలకు వ్యతిరేకంగా ఒక విశిష్టమైన గిరిజన సామాజిక–రాజకీయ ఉద్యమానికి నాయకత్వం వహించారు. ఈ ఉమ్మడి వేడుక ద్వారా, ప్రవాస సంస్థల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయాలని, అలాగే వివిధ వర్గాలు ఒకరి సంప్రదాయాల నుంచి మరొకరు నేర్చుకోవడానికి అవకాశం కల్పించాలని కాన్సులేట్ లక్ష్యంగా పెట్టుకుందని తెలిపింది.

తుఫాన్ బాధిత మైనంపాడు ప్రజలకు తానా ఆపన్నహస్తం



సంతనూతలపాడు: ప్రకాశం జిల్లా ఒంగోలు సమీపంలోని మైనంపాడు గ్రామంలో భారీ తుఫాన్ కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ఆపన్నహస్తం అందించింది. తుఫాన్ ప్రభావంతో మైనంపాడు గ్రామంలోని కుటుంబాల నివాసాల్లోకి వరదనీరు చేరడంతో వంట చేసుకునే పరిస్థితి లేక చిన్నారులు, పెద్దలు ఆహారం కోసం ఇబ్బందులు పడుతున్న విషయం తానా దృష్టికి వచ్చింది. ఈ పరిస్థితికి వెంటనే స్పందించిన తానా కోశాధికారి రాజా కసుకుర్తి, బాధిత కుటుంబాలకు తానా ఆధ్వర్యంలో భోజనాలు అందించేలా చర్యలు తీసుకున్నారు. తానా ఆధ్వర్యంలో చిన్నారులు, మహిళలు, వృద్ధులు సహా బాధిత కుటుంబాలకు పౌష్టికాహారంతో కూడిన భోజనాలను పంపిణీ చేశారు. విపత్కర పరిస్థితుల్లో తమ ఆకలిని తీర్చేందుకు ముందుకు వచ్చిన తానా సేవలను స్థానికులు అభినందించారు. ఈ సందర్భంగా తానా కోశాధికారి రాజా కసుకుర్తి మాట్లాడుతూ "ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడం మనందరి సామాజిక బాధ్యత. అవసరంలో ఉన్న వారికి సకాలంలో సహాయం అందించడమే తానా సేవా లక్ష్యం" అని పేర్కొన్నారు.

రాహుల్ తీరు సిగ్గుచేటు: అమిత్ షా



కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా మరోసారి విమర్శలు గుప్పించారు. తరచూ విదేశీ పర్యటనలకు వెళ్లే రాహుల్ గాంధీ అంతర్జాతీయ వేదికలపై భారత్ పరువుకు భంగం కలిగించే వ్యాఖ్యలు చేసి అధికారంలోకి రాలేరని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు వస్తుంటే రాహుల్ గాంధీ మాత్రం విమర్శించే ప్రయత్నం చేస్తుంటారని విమర్శించారు. రాహుల్ ప్రయత్నాలు ఎన్నటికీ ఫలించబోవని మహారాష్ట్రలోని పుణే నగరంలో ఆదివారం జరిగిన ఒక కార్యక్రమంలో అమిత్ షా అన్నారు. మీరు అధికారంలోకి రావాలనుకుంటే ముందుగా విదేశీ పర్యటనలను కట్టిపెట్టాలి. గ్రామాల్లో పర్యటించాలి. అప్పుడైతే ఏదో ఒక రోజు పరిస్థితులు అనుకూలంగా మారతాయి. కానీ మీరు నా మాట వినరని తెలుసు. కాబట్టి నేను కాంగ్రెస్ కార్యకర్తలకు చెప్పేదేంటంటే రాహుల్ గాంధీని మీరు ఇదే తీరులో కొనసాగనిస్తే మరో 30 ఏళ్ల వరకూ మీకు అవకాశం ఉండదని స్పష్టం చేశారు.

హైదరాబాద్‌లో భారత్ సమ్మిట్ కార్యక్రమంలో ఇటలీ రాజకీయ నాయకుడు వోట్ చోరీ ప్రస్తావన తేవడాన్ని హోం మంత్రి అమిత్ షా ఆక్షేపించారు. వరుసగా మూడు ఎన్నికల్లో ఓటమి చవి చూసిన కాంగ్రెస్ ఈ విధంగా తన ఓటమి వెళ్లగక్కుతోందని అన్నారు. అందుకే దేశంలోని లెఫ్టిస్టు వాదులతోపాటు విదేశీ వామపక్షవాదులను కూడా కాంగ్రెస్ ఆహ్వానించిందని చెప్పారు. కార్యక్రమానికి భారత్ సమ్మిట్ అని పేరు ఉన్నప్పటికీ రాహుల్ గాంధీ మాత్రం అంతర్జాతీయ వేదికల్లో జాతి వ్యతిరేక అభిప్రాయాలను వెల్లడిస్తుంటారని విమర్శించారు. మీకు పదేళ్ల అధికారం దక్కింది. కానీ 12 లక్షల కోట్ల రూపాయల స్కామ్‌లు, అవినీతికి పాల్పడ్డారు. అందుకే ప్రజలు ప్రజలు మిమ్మల్ని అధికార పీఠం నుంచి చేయిపట్టి లాగేశారు. ప్రధాని నరేంద్ర మోదీ 12 ఏళ్లుగా అధికారంలో ఉన్నా ఒక్క అవినీతి ఆరోపణ కూడా లేదు' అని మంత్రి అమిత్ షా చెప్పారు.

ఉత్తరాఖండ్‌లో వేదికపై ఎమ్మెల్యే వీరంగం

ఉత్తరాఖండ్‌లోని పితోరాగఢ్ జిల్లాలో నిర్వహించిన జౌల్జీబీ జాతరలో శనివారం రాజకీయ దుమారం చెలరేగింది. వేదికపై మాట్లాడేందుకు అవకాశం ఇవ్వలేదంటూ ఆగ్రహంతో ధార్చుల నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే హరీశ్ సింగ్ ధామి మైక్‌ను విసిరికొట్టారు. శనివారం జౌల్జీబీ జాతరకు హాజరైన ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కొంత సమయం తర్వాత అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆ తర్వాత ఎమ్మెల్యే హరీశ్ సింగ్ ధామి తన మద్దతుదారులతో కలసి వేదికపై చేరి గందరగోళం సృష్టించారు. జాతరకు అధ్యక్షుడిగా ఉన్న తనకు ముఖ్యమంత్రి సమక్షంలో మాట్లాడడానికి అవకాశం ఇవ్వలేదని.. ఆ తర్వాత మాట్లాడేందుకు ప్రయత్నించినా మైకును ఆపేశారని ఆగ్రహంతో మైకును విసిరికొట్టారు. వేదికపై ఉన్న పోడియాన్ని, కుర్చీలను పడేశారు. రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వంపై, సీఎం పుష్కర్ సింగ్ ధామిపై విమర్శలు గుప్పించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీనిపై భాజపా స్పందిస్తూ.. ఎమ్మెల్యే స్థానంలో ఉన్న వ్యక్తి ఈ విధంగా ప్రవర్తించడం సిగ్గుచేటని విమర్శించింది.

నేడు ఫిలిప్పీన్స్‌కు ప్రధాని మోదీ

మూడు రోజుల పాటు పర్యటన



వార్షిక ఆసియాన్-ఇండియా సదస్సు, తూర్పు ఆసియా సదస్సుల్లో పాల్గొనేందుకు ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాకు బయలుదేరి వెళ్లనున్నారు. 11 సభ్యదేశాల ఆసియాన్ కూటమికి ప్రస్తుత అధ్యక్ష హోదాలో ఉన్న ఫిలిప్పీన్స్ ఈ ప్రతిష్ఠాత్మక సదస్సులకు ఆతిథ్యం ఇస్తోంది. భారత్ 'యాక్ట్ ఈస్ట్' విధానంలో భాగంగా ఇండో-పసిఫిక్ ప్రాంతంలో సముద్ర భద్రత, ఆర్థిక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసుకోవడమే లక్ష్యంగా ఈ పర్యటన సాగనుంది. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి (ఈస్ట్) రుద్రేంద్ర టాండన్ వెల్లడించారు.

ప్రధాని మోదీ పర్యటన షెడ్యూల్, ప్రధాన సదస్సులు

నవంబర్ 16 నుంచి 18 వరకు ప్రధాని మోదీ మనీలా పర్యటన కొనసాగుతుంది. 17న ఆయన 23వ ఆసియాన్-ఇండియా సదస్సు, 21వ తూర్పు ఆసియా సదస్సు (ఈఏఎస్)లో పాల్గొంటారు. ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్ జూనియర్ విదేశీ అతిథుల కోసం ఏర్పాటు చేసే ప్రత్యేక విందులో పాల్గొనడంతో పాటు, పలు దేశాల నేతలతో ప్రధాని మోదీ ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించనున్నారు. అలాగే, అక్కడి ప్రవాస భారతీయులతోనూ ఆయన భేటీ అయ్యే అవకాశం ఉంది.

'నావిగేటింగ్ ది ఫ్యూచర్' అనే ప్రధాన ఇతివృత్తంతో ఈఏడాది సదస్సు జరుగుతోంది. 2026 సంవత్సరాన్ని'ఆసియాన్-ఇండియా సముద్ర సహకార సంవత్సరం'గా నిర్వహిస్తుండటం విశేషం.

వాణిజ్య ఒప్పందంపై సమీక్ష

భారత్-ఆసియాన్ కూటమి మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం ప్రస్తుతం సుమారు 122 బిలియన్ డాలర్లుగా ఉంది. అయితే, వాణిజ్య లోటును తగ్గించుకునేందుకు గాను ఆసియాన్-ఇండియా వస్తు వాణిజ్య ఒప్పందాన్ని త్వరిత గతిన సమీక్షించి, పూర్తి చేయాలని భారత్ భావిస్తోంది. బహుళ దేశాలతో కూడిన సంక్లిష్ట చర్చల కారణంగా దీనికి కొంత సమయం పడుతున్నప్పటికీ, ద్వైపాక్షిక వాణిజ్య సరళీకరణ చర్యలను భారత్ వేగవంతం చేస్తోంది.

సముద్ర భద్రత, బ్రహ్మోస్ క్షిపణులు, మయన్మార్ అంశం

దక్షిణ చైనా సముద్రం ప్రాంతంలో రూపొందించే ఆసియాన్-చైనా ప్రవర్తనా నియమావళి అంతర్జాతీయ సముద్ర చట్టాలకు పూర్తిగా లోబడి ఉండాలని భారత్ స్పష్టం చేసింది.

బ్రహ్మోస్ ఒప్పందం: 2022లో భారత్ నుంచి 375 మిలియన్ డాలర్ల విలువైన బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణులను కొనుగోలు చేసిన తొలి విదేశీ కస్టమర్‌గా నిలిచిన ఫిలిప్పీన్స్, ఇప్పుడు మరిన్ని బ్రహ్మోస్ యూనిట్లను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతూ భారత్‌కు ప్రతిపాదనలు పంపింది.

మయన్మార్ సంక్షోభం: మయన్మార్‌తో భారత్‌కు 1,643 కిలోమీటర్ల సరిహద్దు, కలాదాన్ వంటి కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు ఉన్న నేపథ్యంలో ఆ దేశాన్ని దౌత్యపరంగా ఏకాకిని చేయడం సరైన విధానం కాదని భారత్ అభిప్రాయపడింది. కాగా, ఈ సదస్సులో మయన్మార్ తరపున ఆ దేశ విదేశాంగ శాఖ అధికారి పాల్గొంటున్నారు.

ట్రంప్‌తో భేటీ, క్వాడ్ సదస్సుపై ఉత్కంఠ

మనీలా సదస్సు సందర్భంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని మోదీ భేటీ అవుతారా, లేదా క్వాడ్ (భారత్, అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్) నేతల సదస్సు జరుగుతుందా అనే దానిపై విదేశాంగ శాఖ ఇంకా స్పష్టత ఇవ్వలేదు. అయితే, క్వాడ్ కూటమి బలహీనపడిందంటూ 'పొలిటికో' పత్రిక రాసిన కథనాన్ని అమెరికా విదేశాంగ శాఖ తీవ్రంగా ఖండించింది. వచ్చే వారం ఆసియాన్ సదస్సు వేదికగా క్వాడ్ నేతల సదస్సును నిర్వహించేందుకు కృషి చేస్తున్నామని అమెరికా అధికారి డైలాన్ జాన్సన్ స్పష్టం చేశారు. మరోవైపు, ఈ సదస్సుకు చైనా ప్రీమియర్ లీ కియాంగ్, ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్ సహా 19 మందికి పైగా ప్రపంచ నేతలు హాజరవుతున్నారు.

భారత్‌లో విమానయాన భద్రతా ప్రమాణాలపై..

నేటినుంచి అమెరికా బృందం పరిశీలన



అమెరికాకు చెందిన ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్ఏఏ) బృందం సోమవారం నుంచి ఐదు రోజుల పాటు భారత్‌లో పర్యటించనుంది. భారత్ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) నియంత్రణ చట్టాలు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయో లేవో పరిశీలించనుంది. శిక్షణ పొందిన సిబ్బంది, సంస్థాగత సామర్థ్యాలు ఉన్నాయో లేదో పరీక్షించనుంది. ఎస్ఏఏ నిర్వహించే ఇంటర్నేషనల్ ఏవియేషన్ సేఫ్టీ అసెస్మెంట్ (ఐఏఎస్ఏ) లో కేటగిరి 1 స్థానాన్ని నిలబెట్టుకునేందుకు భారత్ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న తరుణంలో ఈ పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది.

ఎస్ఏఏ ఏం పరీక్షిస్తుంది?

అంతర్జాతీయ విమానయాన భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా డీజీసీఏ వ్యవహరిస్తుందా... లేదా అనే అంశంపై ఎస్ఏఏ ప్రధానంగా దృష్టి సారిస్తుంది. అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ (ఐసీఏవో) భద్రత ప్రమాణాలను డీజీసీఏ సమర్థంగా అమలు చేస్తుందో లేదో పరిశీలిస్తుంది. దేశ విమానయాన చట్టాలు, పౌర విమానయాన కార్యకలాపాలను నియంత్రించే నిబంధనలు, భద్రతా ప్రమాణాలు, సిబ్బంది సాంకేతిక అర్హతలు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తుంది. విమాన సిబ్బందికి లైసెన్సులు, విమాన ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసేందుకు పటిష్ఠ వ్యవస్థలు ఉన్నాయో లేదో ఆరా తీస్తుంది. ఎయిర్ లైన్స్ కార్యకలాపాలను నియంత్రించేందుకు, ఉల్లంఘనల గుర్తింపు, చర్యల గురించి తెలుసుకుంటుంది.

కేటగిరీ 1 రేటింగ్‌తో ఉపయోగమేంటి?

ఐసీఏవో భద్రత ప్రమాణాలను సమర్థంగా అమలు చేసినప్పుడే. ఎస్ఏఏ ఈ రేటింగ్ ఇస్తుంది. కేటగిరీ -1లో ఉన్న దేశాల నుంచి తమ దేశానికి ఎయిర్లైన్ సేవలను విస్తరించుకునేందుకు అమెరికా అవకాశం కల్పిస్తుంది. వేగంగా విస్తరిస్తున్న భారత విమానయాన రంగానికి ఈ గుర్తింపు చాలా అవసరం. కేవలం అమెరికా మార్కెట్లోకి ప్రవేశించడానికి మాత్రమే కాకుండా.. భారతదేశ విమానయాన నియంత్రణ వ్యవస్థపై విశ్వాసాన్ని బలోపేతం చేయడానికి కూడా ఎఫ్ఏఏ ఆడిట్ సహకరిస్తుంది.

అటవీ అధికారి ఇంట్లో కళ్లుచెదిరే నగలు, నగదు



మధ్యప్రదేశ్లో ఓ టైగర్ రిజర్వ్ ఉన్నతాధికారి ఇళ్లలో లోకాయుక్త అధికారులు సోదాలు చేపట్టి భారీగా నగలు, నగదును స్వాధీనం చేసుకున్నారు. సత్పూర టైగర్ రిజర్వ్‌లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న సంజీవ్ కుమార్ శర్మ ఇళ్లలో ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. ఆయనతోపాటు ఆయన భార్య పేరిట ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయన్న ఆరోపణల నేపథ్యంలో ఈ సోదాలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

పామ్మర్షిలోని సంజీవ్ అధికారిక నివాసం, కార్యాలయంతోపాటు చింద్వారాలోని ఇంటిలో అధికారులు సోదాలు చేపట్టారు. 2.5 కిలోల బంగారం, 1.6 కిలోల వెండి, రూ.26 లక్షలకు పైగా నగదును స్వాధీనం చేసుకున్నారు.

వీటితోపాటు నాలుగు వాహనాలు, దాదాపు రూ.50 లక్షల విలువైన ఖరీదైన గృహోపకరణాలను గుర్తించారు. మరోవైపు ఆ అధికారికి చెందిన రూ.2 కోట్ల విలువైన ఓ రిసార్ట్, రూ.కోటి విలువైన విల్లాను కూడా గుర్తించినట్లు తెలిపారు. మొత్తం రూ.7.6 కోట్ల విలువైన ఆస్తులను ఇప్పటి వరకు గుర్తించినట్లు.. ఇది ప్రాథమిక అంచనా మాత్రమే అని అధికారులు చెబుతున్నారు. సోదాలు ఇంకా కొనసాగుతున్నాయి.

మెటాకు షాక్..

భారీ జరిమానా విధించిన ఇటలీ




ప్రముఖ సోషల్ మీడియా సంస్థ మెటాకు ఇటలీలో భారీ ఎదురుదెబ్బ తగిలింది. వినియోగదారుల అనుమతి లేకుండా వారి వ్యక్తిగత ఫొటోలు, వీడియోలను యాక్సెస్ చేసినట్లు ఆరోపణలు రావడంతో మెటాకు ఇటలీ డేటా పరిరక్షణ సంస్థ భారీ జరిమానా విధించింది. ఏకంగా 805 మిలియన్ యూరోలు (సుమారు రూ.7,400 కోట్లు) చెల్లించాలని ఆదేశించింది. ఆండ్రాయిడ్ యాప్‌లోని ఓ ప్రత్యేక ఫీచర్ ద్వారా ఈ ఉల్లంఘన జరిగినట్లు అధికారులు వెల్లడించారు.

ఫేస్‌బుక్ ఆండ్రాయిడ్ యాప్‌లో 2023 నుంచి 'గెట్ సజెషన్స్ ఫ్రమ్ గ్యాలరీ వెన్ బ్రౌజింగ్ ఫేస్‌బుక్' అనే ఫీచర్ అందుబాటులో ఉంది. వినియోగదారులు ఫేస్‌బుక్‌లో బ్రౌజ్ చేస్తున్నప్పుడు వారి ఫోన్ గ్యాలరీలోని ఫొటోలు, వీడియోలను పోస్టులుగా పెట్టేందుకు ఈ ఫీచర్ సూచనలు ఇస్తుంది. అయితే ఈ ఫీచర్‌ను ఉపయోగించుకుని వినియోగదారుల ఫోన్‌లోని ఫొటోలు, వీడియోలు, వాటికి సంబంధించిన ఇతర సమాచారాన్ని ప్రత్యేకమైన అనుమతి తీసుకోకుండానే యాక్సెస్ చేసినట్లు ఇటలీ అధికారులు గుర్తించారు. ఈ విషయాన్ని కూడా వినియోగదారులకు స్పష్టంగా తెలియజేయలేదని పేర్కొన్నారు.

ఈ వ్యవహారంతో ఇటలీలో దాదాపు 2 కోట్ల మంది ఆండ్రాయిడ్ వినియోగదారులు ప్రభావితమై ఉండవచ్చని డేటా పరిరక్షణ సంస్థ అంచనా వేసింది. ఈ ఉల్లంఘన నేపథ్యంలో మెటాకు ఇటలీ అధికారులు పలు ఆదేశాలు జారీ చేశారు. ఫోన్ గ్యాలరీ నుంచి ఫొటోలు, వీడియోలను సూచించే ఫీచర్‌ను ముందుగా నిలిపివేయాలని స్పష్టం చేశారు. దాన్ని ఉపయోగించాలనుకునే వారి నుంచి ప్రత్యేకంగా, స్పష్టంగా అనుమతి తీసుకోవాలని ఆదేశించారు. ఈ మార్పులు చేసేందుకు మెటాకు 60 రోజుల గడువు ఇచ్చారు. ఇటలీ విధించిన జరిమానాపై మెటా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. నియంత్రణ సంస్థ నిర్ణయంతో తాము ఏకీభవించడం లేదని, విధించిన జరిమానా అసమంజసంగా ఉందని పేర్కొంది. దీనిపై అప్పీల్ చేస్తామని తెలిపింది.

ఒక కాంతిరోజు దూరంలోకి వాయేజర్-1!



అమెరికా అంతరిక్ష సంస్థ (నాసా) ప్రయోగించిన వాయేజర్-1 వ్యోమనౌక ఒక అద్భుత రికార్డును సృష్టించబోతోంది. భూమి నుంచి ఒక కాంతి రోజు (లైట్ డే) దూరంలోకి వెళ్లబోతోంది. వాయేజర్-1 బుధవారం ఈ అద్భుతమైన మైలురాయిని చేరుకోబోతోంది. తద్వారా ఆ ఘనత సాధించిన మొట్టమొదటి స్పేస్ క్రాఫ్ట్‌గా రికార్డుకెక్కబోతోంది. ఇప్పటిదాకా మానవ నిర్మిత వస్తువులన్నింటికంటే ఎక్కువ దూరం ప్రయాణించిన వస్తువుగా చరిత్ర సృష్టించనుంది. తొలి మానవ నిర్మిత వస్తువుగా గుర్తింపు పొందనుంది. ప్రస్తుతం ఇది పుడమి నుంచి 2,600 కోట్ల కిలోమీటర్ల దూరంలో ఉంది. అక్కడి నుంచి ఈ వ్యోమనౌక పంపే సంకేతాలు.. కాంతి వేగంతో ప్రయాణించినా భూమికి చేరుకోవడానికి దాదాపు 24 గంటలు పడుతోంది. అంటే.. అది ఒక కాంతి రోజు దూరంలో ఉందన్నమాట! ఒక కాంతి సంవత్సరం దూరంలోకి వెళ్లడానికి ఈ వ్యోమనౌకకు మరో 18వేల సంవత్సరాలు పడుతుందని నాసా చెబుతోంది. 36వేల సంవత్సరాల కన్నా ఎక్కువ దూరం వెళితే అది మరో 'నక్షత్రం'గా మారుతుందని చెప్పారు. వాయేజర్-1ను నక్షత్రాల మధ్య దూసుకుపోతున్న భూమి రాయబారిగా ప్రాజెక్ట్ మేనేజర్ సుజాన్ డాడ్ అభివర్ణించారు. ఇది ఒక జాతీయ సంపద అని చెప్పారు.

ఈ సందర్భాన్ని పురస్కరించుకొని మంగళవారం సూర్యాస్తమయం తర్వాత వాయేజర్ కాల్ సైన్ అయిన వి-జి-ఆర్ అనే అక్షరాలను మోర్స్ కోడ్ ఉపయోగించి రాత్రి ఆకాశంలో ప్రదర్శించబోతున్నారు. వాయేజర్-1, వాయేజర్-2 వ్యోమనౌకలను 1977లో నాసా ప్రయోగించింది. చెదురుమదురు సమస్యలు ఉన్నప్పటికీ వాయేజర్-1, దాని జంట వాయేజర్-2 గంటకు 61,000 కిలోమీటర్ల వేగంతో అంతరిక్షంలోకి దూసుకుపోతూ శాస్త్ర, ఇంజనీరింగ్ సమాచారాన్ని తిరిగి పంపుతూనే ఉన్నాయి. వాయేజర్-2 2035లో ఒక కాంతి దినం మైలురాయిని చేరుకుంటుంది. వాయేజర్-1 సౌర వ్యవస్థ నుంచి నిష్క్రమించే ముందు 1979, 1980లలో బృహస్పతి, శని గ్రహాలను దాటేసింది. 2012లో నక్షత్ర వ్యవస్థల మధ్య ఉన్న విస్తారమైన ప్రాంతానికి చేరుకుంది.

రన్‌వే పై రెండు విమానాలు ఢీ: తప్పిన పెను ప్రమాదం



అమెరికాలోని మియామి అంతర్జాతీయ విమానాశ్రయంలోని రన్‌వేపై శనివారం రెండు విమానాలు ఒకదానినొకటి ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనలో ఒక విమానం పాక్షికంగా దెబ్బతినగా.. మరో విమానం ముందు భాగం ధ్వంసమయ్యింది. 168 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బందితో ఉన్న కోపా ఎయిర్‌లైన్స్ బోయింగ్ 737 అనే విమానం రెక్క.. యూపీఎస్ బోయింగ్ 767 అనే కార్గో విమానం ముందు భాగాన్ని ఢీకొట్టింది. అమెరికా వ్యాప్తంగా విమాన సేవలకు అంతరాయం ఏర్పడిన ఒక రోజు తరువాత ఈ ఘటన చోటు చేసుకుంది. కాగా ఈ ప్రమాదంలో ఇద్దరు ప్రయాణికులు స్వల్పంగా గాయపడినట్టు కోపా విమానయాన సంస్థ తెలిపింది. మిగతా ప్రయాణికులందరూ క్షేమంగా ఉన్నారని వెల్లడించింది. అలాగే సిబ్బందికి ఎలాంటి గాయాలూ కాలేదని వివరించింది. ఈ ఘటనపై కోపా ఎయిర్లైన్స్ క్షమాపణలు చెప్పింది. ప్రమాదంపై దర్యాప్తునకు సహకరిస్తున్నట్లు తెలిపింది.

ప్రయాణికుల్లో ఆందోళనలు

ఈ ప్రమాదం చోటుచేసుకున్న సమయంలో ప్రయాణికులు ఆందోళన చెందారు. తమకు పెద్ద పెద్ద శబ్దాలు వినిపించాయని చెప్పారు. విమానం ల్యాండింగ్ తరువాత అకస్మాత్తుగా నా చుట్టూ ఉన్న సంభాషణలు బిగ్గరగా వినిపించాయి. ఆ తరువాత ప్రయాణికులు కేకలు వేశారు. ఆపై మరో విమానం మా విమానాన్ని ఢీకొట్టిన శబ్దం వచ్చిందని ఓ ప్రయాణికుడు మీడియాకు తెలిపారు.

రెండు నెలల క్రితం ఇదే విమానాశ్రయంలో అమెజాన్ కార్గో విమానం రన్వే నుంచి పక్కకు దూసుకెళ్లి.. సమీపంలోని వాహనాలను ఢీకొట్టింది. విమానం మంటల్లో చిక్కుకోవడంతో ఐదుగురు ప్రాణాలు కోల్పోగా.. మరో ఐదుగురు గాయపడ్డారు.

విమాన సేవలకు అంతరాయం

కాగా శనివారం అమెరికాలో ఓ చిన్న సాంకేతిక సమస్య విమానయాన సేవలను కుదిపేసింది. టెలికమ్యూనికేషన్ వ్యవస్థలో డేటా ఓవర్‌లోడ్ కారణంగా ఎదురైన సాంకేతిక సమస్యతో విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దేశవ్యాప్తంగా అన్ని విమానాశ్రయాల నుంచి బయల్దేరాల్సిన విమానాలు (సుమారు 8,000) కొన్ని గంటలపాటు ఎక్కడివి అక్కడే నిలిచిపోయాయి. దీంతో 15 లక్షల మంది ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



బహ్రెయిన్‌లో పేలుళ్లు, సైరన్ల మోత

అమెరికా సైనిక స్థావరంపై ఇరాన్ దాడి

పేలుళ్లు,సైరన్లతో గల్ఫ్‌దేశమైన బహ్రెయిన్ దద్దరిల్లింది. బహ్రెయిన్‌లోని రిఫా హెలికాప్టర్ స్థావరం వద్ద ఉన్న అమెరికా సైనిక స్థావరంపై ఆదివారం ఇరాన్ సైన్యానికి చెందిన ఐఆర్‌జీసీ దళం దాడిచేసింది. దీంతో అప్రమత్తమైన బహ్రెయిన్ ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది. వరుస పేలుళ్లు, సైరన్‌ల శబ్దాలతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు.ఎత్తైన ప్రదేశాలను వదిలి, వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని అధికారులు ప్రజలకు సూచించారు. హెలికాప్టర్ బేస్‌పై మొత్తం ఆరు డ్రోన్స్‌తో విజయ వంతంగా దాడిచేశామని పేర్కొంది. అమెరికా మిలిటరీ దూకుడు చర్యలకు ప్రతిగా ఈ దాడి చేసినట్టు తెలిపింది. అయితే, ప్రత్యర్థి చేసిన దాడులను తాము విజయవంతంగా అడ్డుకున్నామని బహ్రెయిన్ మిలిటరీ ప్రకటించింది. సెప్టెంబర్ తరువాత ఇరాన్ మళ్లీ డ్రోన్ దాడికి దిగడం ఇదే తొలిసారి. ఇరాన్‌పై తదుపరి దాడులు ఉండకపోవచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన రోజుల వ్యవధిలోనే ఇరాన్ డ్రోన్ దాడికి దిగడంతో హర్ముజ్‌లో ఉద్రిక్తత చెలరేగింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మొహమ్మద్ ఘాలిబఫ్ కీలక వ్యాఖ్యలు చేశారు. యుద్ధాన్ని ముగించేందుకు ఇప్పటికీ అవకాశం ఉందని అన్నారు. తమ సహేతుక షరతులకు అమెరికా అంగీ కరిస్తే యుద్ధం ముగుస్తుందని చెప్పారు.యుద్ధం లేదు.. శాంతిలేదు.. అనే స్థితిని ఎక్కువ కాలం కొనసాగించడం ఇష్టం లేదని అన్నారు. అయితే,అమెరికా మళ్లీ దాడులకు దిగితే మాత్రం ఈసారి యుద్ధ క్షేత్రాన్ని తాము నిర్ణయిస్తామని హెచ్చరించారు. యుద్ధం మొదలైన తొలినాళ్లలో పలు గల్ఫ్ దేశాలను ఇరాన్ టార్గెట్ చేసిన విషయం తెలిసిందే. బహ్రెయిన్‌తోపాటు యూఏఈ,సౌదీ అరేబియా,ఖతార్, కువెయిట్, జోర్డాన్, ఒమాన్, ఇరాన్‌లపై వేల కొద్దీ డ్రోన్‌లు, మిసైళ్లను ప్రయోగించింది.

ఇజ్రాయెల్ దాడుల్లో హమాస్ కీలక కమాండర్ హతం

ఇజ్రాయెల్ దాడుల్లో హమాస్ కీలక కమాండర్ హతమయ్యాడు.హమాస్ సాయుధ విభాగమైన అల్-ఖస్సాం బ్రిగేడ్స్‌కుచెందిన రఫా బ్రిగేడ్ సీనియర్ కమాండర్ సమీ ర్ అబూ యూనిస్ వైమానిక దాడిలో మరణించినట్లు హమాస్ ప్రకటించింది. ఈ నెల 14న దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్‌కు పశ్చిమాన ఉన్న అల్-మవాసీ ప్రాంతంలో ఈ దాడి జరిగినట్లు పేర్కొంది. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై జరిగిన దాడి ప్రణాళిక, అమలులో సమీర్ కీలకపాత్ర పోషించినట్లు హమాస్ వెల్లడించింది. కాగా, 53ఏళ్ల సమీర్ అబూ యూనిస్ రఫా బ్రిగేడ్ కమాండర్‌గా పనిచేశారు. 1991లో హమాస్ సాయుధ విభాగంలో చేరిన ఆయన.. రఫా ప్రాంతంలో కీలక సైనిక బాధ్యతలు నిర్వహిస్తూ కమాండర్ స్థాయికి ఎదిగారు. ఈ దాడిపై ఇజ్రాయెల్ సైన్యం,అంతర్గత భద్రతా సంస్థ షిన్ బెట్ కూడా సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. తమ దాడుల్లో హమాస్‌కు చెందిన కీలక కమాండర్ మరణించినట్లు తెలిపాయి. అయితే,మృతిచెందిన వ్యక్తి పేరును మాత్రం వెల్లడించలేదు. కాగా, సమీర్ అబూ యూనిస్ మరణం హమాస్ సైనిక నాయకత్వానికి ఎదురుదెబ్బగా విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా దక్షిణ గాజాలో సంస్థ కార్యకలాపాలపై ప్రభావం పడే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు. ఈ పరిణామం కాల్పుల విరమణ ఒప్పంద భవిష్యత్తుపైనా ఆందోళనలు పెంచుతోంది. 2023 అక్టోబర్ 7న హమాస్ జరిపిన దాడిలో సుమారు 1,200 మంది ఇజ్రాయెలీలు మరణించగా, పలువురు బందీలుగా అపహరణకు గురయ్యారు. అనంతరం గాజాపై ఇజ్రాయెల్ భారీ సైనిక చర్యలు చేపట్టింది. 2025 అక్టోబర్‌లో అమెరికా మద్దతుతో కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చినప్పటికీ దాడులు కొనసాగుతున్నాయి. ఒప్పందం ప్రారంభమైనప్పటి నుంచి 1,600 మందికి పైగా పాలస్తీనియన్లు మరణించినట్లు గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. మరోవైపు, ఏడుగురు సైనికులు సహా మొత్తం 8 మంది మరణించినట్లు ఇజ్రాయెల్ వెల్లడించింది.

బౌలర్ల మాయాజాలం..

వన్ డే సిరీస్ భారత్ కైవసం

- న్యూజిలాండ్ గడ్డపై టీమిండియా రికార్డ్
- ఒకే పర్యటనలో వన్ డే, టీ 20 సిరీస్‌ల్లో విజయం

మౌంట్ మౌంగనుయి వేదికగా న్యూజిలాండ్‌తో ఆదివారం జరిగిన ఐదో వన్డేలో 22 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో బ్యాటర్లు నిరాశపరిచినప్పటికీ.. బౌలర్లు మాత్రం అద్భుతమైన ప్రదర్శన కనబరిచారు. 210 పరుగుల లక్ష్య ఛేదనలో న్యూజిలాండ్‌ను 187 పరుగులకే చుట్టేసి జట్టుకు చారిత్రాత్మక విజయాన్ని అందించారు. ఈ గెలుపుతో ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను 3-1 తేడాతో భారత్ సొంతం చేసుకుంది. తొలి రెండు మ్యాచుల్లో భారత్ విజయం సాధించగా.. మూడో వన్డే వర్షం కారణంగా రద్దు అయిన సంగతి తెలిసిందే. కాగా నాలుగో వన్డేలో న్యూజిలాండ్ గెలిచింది. దీంతో సిరీస్ 3-1 తేడాతో భారత్ వశమైంది.



ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. 209 పరుగులకు ఆలౌటైంది. సీనియర్ బ్యాటర్ రోహిత్ శర్మ(7), విరాట్ కోహ్లీ(5) విఫలమయ్యారు. అక్షర్ పటేల్(46), ఇషాన్ కిషన్(46) రాణించారు. నమన్ ధీర్(22), శ్రేయస్ అయ్యర్(22) పర్వాలేదనిపించారు. కివీస్ బౌలర్లలో డఫీ 3, శాంట్నర్ 3, ఫిషర్ 2, టిక్నర్, బ్రేస్‌వెల్ తలొక వికెట్ పడగొట్టారు.

అనంతరం ఈ స్వల్ప లక్ష్య ఛేదనలో భారత బౌలర్ల ధాటికి కివీస్ 46 ఓవర్లలో 175 పరుగులకే ఆలౌటైంది. బ్లాక్ క్యాప్స్ బ్యాటర్లలో డీన్ ఫాక్స్ క్రాఫ్ట్(31) టాప్ స్కోరర్గా నిలవగా.. శాంట్నర్(24), నిక్ కెల్లీ(24) కాస్త ఫర్వాలేదనిపించారు.

అర్ష్‌దీప్ సింగ్ మూడు వికెట్లు పడగొట్టగా.. మహ్మద్ సిరాజ్, అక్షర్ పటేల్ తలా రెండు వికెట్లు సాధించారు. వీరితో పాటు అకిబ్ నబీ, నమన్ ధీర్, యశ్ ఠాకూర్ తలా వికెట్ పడగొట్టారు. 10 ఓవర్లు వేసి 30 పరుగులే ఇచ్చి 3 వికెట్లు పడగొట్టిన భారత పేసర్ అర్ష్‌దీప్ సింగ్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

న్యూజిలాండ్ గడ్డపై భారత్‌కు ఇది మూడో ద్వైపాక్షిక వన్డే సిరీస్ విజయం. గతంలో 2009, 2018-19 సీజన్‌లోనూ భారత జట్టు అక్కడ వన్డే సిరీస్‌లను గెలుచుకుంది. తాజా విజయంతో మరోసారి కివీస్ గడ్డపై తన ఆధిపత్యాన్ని చాటుకుంది. అయితే న్యూజిలాండ్ ఏడేళ్ల తర్వాత స్వదేశంలో వన్డే సిరీస్ కోల్పోవడం గమనార్హం.

కాగా న్యూజిలాండ్‌పై ఒకే పర్యటనలో వన్డే, టీ20 సిరీస్‌లు రెండింటినీ భారత్ గెలుచుకోవడం క్రికెట్ చరిత్రలో ఇదే తొలిసారి కావడం విశేషం. ఇప్పటివరకు కివీస్ గడ్డపై ఎన్నో ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడినప్పటికీ, ఒకే టూర్‌లో రెండు ఫార్మాట్లలోనూ విజేతగా నిలవడం టీమిండియాకు సాధ్యం కాలేదు. కానీ ఈసారి భారత జట్టు అద్భుత ప్రదర్శనతో ఈ కలను సాకారం చేసుకుంది. తొలుత టీ20 సిరీస్‌ను, ఆ తర్వాత వన్డే సిరీస్ ను కైవసం చేసుకుని టీమిండియా సరికొత్త రికార్డును నెలకొల్పింది.



చరిత్ర సృష్టించిన లక్ష్యసేన్

జపాన్ మాస్టర్స్ టోర్నీ కైవసం

భారత బ్యాడ్మింటన్ స్టార్ లక్ష్యసేన్ మరోసారి తన సత్తా చాటాడు. జపాన్ గడ్డపై అద్భుతమైన ఆటతీరుతో చరిత్ర సృష్టించాడు. జపాన్ మాస్టర్స్-2026 సూపర్ 500 టోర్నీలో పురుషుల సింగిల్స్ టైటిల్‌ను సొంతం చేసుకుని, ఈ ఘనత సాధించిన తొలి భారతీయుడిగా రికార్డు నెలకొల్పాడు. ఆదివారం జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్లో జపాన్ ఆటగాడు కోకి వతనాబేపై 13-21, 21-18, 21-14 తేడాతో లక్ష్యసేన్ విజయం సాధించాడు.

తొలి గేమ్‌లో కోకి వతనాబే చెలరేగిపోయాడు. వేగవంతమైన షాట్లతో ఆధిపత్యం ప్రదర్శించాడు. 13-21తో తొలి గేమ్‌ను సొంతం చేసుకున్నాడు. అయితే, ఏ మాత్రం ఆత్మవిశ్వాసం కోల్పోని భారత షట్లర్ రెండో గేమ్‌లో అద్భుతంగా పుంజుకున్నాడు. కీలక పాయింట్ల వద్ద సంయమనం పాటిస్తూ, ప్రత్యర్థికి గట్టి పోటీనిచ్చాడు. చివరకు 21-18తో రెండో గేమ్‌ను గెలుచుకుని మ్యాచ్‌ను నిర్ణయాత్మక మలుపు తిప్పాడు. మూడో గేమ్‌లో లక్ష్యసేన్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించాడు. ఆరంభం నుంచే దూకుడుగా ఆడుతూ వతనాబేపై ఒత్తిడి పెంచాడు. వరుస పాయింట్లతో స్కోరు బోర్డును పరుగులు పెట్టిస్తూ 21-14తో మూడో గేమ్‌ను కైవసం చేసుకున్నాడు. దీంతో 13-21, 21-18, 21-14తో మ్యాచ్‌ను గెలిచి టైటిల్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు.

జపాన్ మాస్టర్స్ విజయం లక్ష్యసేన్‌కు టైటిల్‌తో పాటు కీలక ర్యాంకింగ్ పాయింట్లనూ అందించనుంది. ఈ గెలుపుతో అతని ఖాతాలో 9,200 ర్యాంకింగ్ పాయింట్లు చేరనున్నాయి. ఈ పాయింట్లు బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ స్టాండింగ్స్‌లో 12వ స్థానం నుంచి ఆరో స్థానానికి చేరుకోవాలన్న లక్ష్యసేన్ ఆశలకు బలాన్ని ఇవ్వనున్నాయి. కాగా, ఇటీవలే హైలో ఓపెన్ టైటిల్‌ను గెలుచుకున్న లక్ష్యసేన్.. జపాన్ మాస్టర్స్‌లోనూ అదే జోరును కొనసాగించాడు.

2031 వన్‌డే వరల్డ్ కప్...

ఆతిథ్య హక్కులు భారత్‌కు!

భారత క్రికెట్ అభిమానులకు మరో శుభవార్త. 2031 వన్డే ప్రపంచకప్ నిర్వహణ హక్కులను భారత్ దక్కించుకుంది. బంగ్లాదేశ్ కూడా ఈ టోర్నీకి సహ ఆతిథ్య దేశంగా వ్యవహరించనుంది. అంతేకాకుండా 2029 ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహణ బాధ్యతలను కూడా భారత్‌కే అప్పగిస్తూ అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఆదివారం ప్రకటించింది. ఇండోనేసియాలోని బాలిలో జరిగిన ఐసీసీ బోర్డు సమావేశాల్లో 2035 వరకు జరగనున్న పురుషుల క్రికెట్‌లోని ప్రధాన టోర్నీల తేదీలను ఖరారు చేసి ఆమోదించారు. ముఖ్యంగా 2027లో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్, మెన్స్ వన్డే వరల్డ్ కప్ జరగనుండగా.. అప్పటినుంచి 2035 చివరి నాటికి మొత్తం 12 ఐసీసీ మెగా టోర్నీలు నిర్వహించనున్నట్లు ఐసీసీ స్పష్టం చేసింది. ఇప్పటివరకు 2031 వరకు జరగాల్సిన టోర్నీల తేదీలు, వేదికలను ఆమోదించిన ఐసీసీ.. 2031 తర్వాత జరిగే టోర్నీల వేదికలను మాత్రం త్వరలోనే ప్రకటిస్తామని వెల్లడించింది. కాగా 2027, 2029, 2031 డబ్ల్యూటీసీ ఫైనల్స్‌కు ఇంగ్లండ్ ఆతిథ్యం ఇవ్వనుంది.

భారత్‌లో ఐదోసారి వన్డే ప్రపంచకప్

వన్డే ప్రపంచకప్‌కు భారత్ ఆతిథ్యమివ్వడం ఇది ఐదోసారి కానుండటం విశేషం. తొలిసారిగా 1987లో ఈ మెగా టోర్నీకి భారత్ ఆతిథ్యమిచ్చింది. ఆ తర్వాత 1996లో పాకిస్థాన్, శ్రీలంకతో కలిసి నిర్వహించింది.



2011లో బంగ్లాదేశ్, శ్రీలంకతో కలిసి మరోసారి ప్రపంచకప్ మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చింది. ఇక 2023లో పూర్తిస్థాయి ఆతిథ్య దేశంగా వ్యవహరించింది. ఆ టోర్నీలో భారత జట్టు అద్భుత ప్రదర్శనతో ఫైనల్‌కు చేరినా.. అహ్మదాబాద్‌లో జరిగిన తుదిపోరులో ఆస్ట్రేలియా చేతిలో ఓటమి పాలైంది. ఇప్పుడు 2031లో మరోసారి ప్రపంచకప్ నిర్వహణ బాధ్యతలు భారత్‌కు దక్కాయి.

23 ఏళ్ల తర్వాత ఛాంపియన్స్ ట్రోఫీ..

ఛాంపియన్స్ ట్రోఫీకి భారత్ ఆతిథ్యమివ్వడం 2006 తర్వాత ఇదే తొలిసారి. అంటే దాదాపు 23 ఏళ్ల తర్వాత ఈ టోర్నీ మళ్లీ భారత్‌లో జరగనుంది. 2029 అక్టోబర్ 9 నుంచి 28 వరకు ఈ పోటీలు నిర్వహించనున్నారు.

2035 వరకు ఐసీసీ మెన్స్ క్రికెట్ టోర్నీల షెడ్యూల్ ఇదే..

2028: టీ20 ప్రపంచకప్ - ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ (అక్టోబర్ 12 - నవంబర్ 12), 2029: వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ - ఇంగ్లండ్ (జూన్ 8-12), 2029: ఛాంపియన్స్ ట్రోఫీ - భారత్ (అక్టోబర్ 9-28), 2030: టీ20 ప్రపంచకప్ - ఇంగ్లండ్, ఐర్లాండ్, స్కాట్లాండ్ (జులై 4 - ఆగస్టు 4), 2031: వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ - ఇంగ్లండ్ (జూన్ 12-16), 2031: వన్డే ప్రపంచకప్ - భారత్, బంగ్లాదేశ్ (అక్టోబర్ 9 - నవంబర్ 23), 2032: టీ20 ప్రపంచకప్ - ఆతిథ్య దేశాలు ఖరారు కావాల్సి ఉంది (అక్టోబర్ 14 - నవంబర్ 14), 2033: వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ - వేదిక ఖరారు కావాల్సి ఉంది (జూన్ 9-13), 2033: ఛాంపియన్స్ ట్రోఫీ - వేదిక ఖరారు కావాల్సి ఉంది (అక్టోబర్ 2-23), 2034: టీ20 ప్రపంచకప్ - వేదిక ఖరారు కావాల్సి ఉంది (జులై 6 - ఆగస్టు 6), 2035: వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ - వేదిక ఖరారు కావాల్సి ఉంది (జూన్ 7-11), 2035: వన్డే ప్రపంచకప్ - వేదిక ఖరారు కావాల్సి ఉంది (అక్టోబర్ 2 - నవంబర్ 18)

బౌలర్ల వల్లే ఈ విజయం: శ్రేయస్ అయ్యర్



న్యూజిలాండ్‌తో జరిగిన ఆఖరి వన్డేలో బౌలర్ల అద్భుత ప్రదర్శన కారణంగానే 22 పరుగులతో విజయం సాధించామని భారత జట్టు తాత్కాలిక వన్డే కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ చెప్పాడు. ఈ విజయానికి బౌలర్ల ప్రదర్శనే ప్రధాన కారణమన్నాడు. బ్యాటర్లకు అంతగా అనుకూలించని పరిస్థితుల్లో బౌలర్లు ఒత్తిడిని అధిగమించి జట్టును విజయతీరాలకు చేర్చారని తెలిపాడు. ఈ సిరీస్ మొత్తాన్ని పరిశీలిస్తే ఇది బ్యాటర్లకు అనుకూలమైన సిరీస్ కాదు. బౌలర్లు అద్భుతంగా బౌలింగ్ చేశారు. కీలక సమయాల్లో బాధ్యత తీసుకుని జట్టు విజయం కోసం నిలబడ్డారు. పరిస్థితులతో సంబంధం లేకుండా జట్టును గెలిపించగలమన్న నమ్మకం వారిలో కనిపించింది. ప్రతి ఆటగాడిలోనూ కనిపించిన ఆత్మవిశ్వాసం, పోరాట పటిమ అద్భుతం. న్యూజిలాండ్‌లో టీ20, వన్డే సిరీస్‌ల్లో మాకు భిన్నమైన పరిస్థితులు ఎదురయ్యాయి. వాతావరణం కూడా మారుతూ వచ్చింది. ఎన్నో సవాళ్లు ఎదురైనా వాటిని అధిగమించి విజయాలు సాధించాం. ఇది నిజంగా గొప్ప ఘనత. చివరి వన్డేలో బ్యాటింగ్‌లో పెద్దగా పరుగులు చేయలేక పోయినా మ్యాచ్‌ను ఎప్పుడైనా మలుపుతిప్పగలమన్న నమ్మకం మాలో ఉంది. అందరూ ఒకే ఆలోచనతో ఆడారు. అనుకున్న ప్రణాళికలను అమలు చేయగలిగాం' అని అయ్యర్ వివరించాడు.

చైతన్య రథం
సినిమా
సోమవారం 16 నవంబరు 2026
X

స్వగ్రామంలో గిరిబాబు అంత్యక్రియలు



తెలుగు చిత్ర పరిశ్రమ సీనియర్ నటుడు గిరిబాబు అంత్యక్రియలు పూర్తయ్యాయి. ప్రకాశం జిల్లాలోని ఆయన స్వగ్రామం రావినూతలలో కుటుంబసభ్యులు, బంధుమిత్రులు, అభిమానుల సమక్షంలో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. తమ అభిమాన నటుడిని చివరిసారి చూసేందుకు గ్రామస్థులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతమవుతూ ఆయనకు తుది వీడ్కోలు పలికారు.

ముఖ్యంగా తండ్రి పార్థివదేహం వద్ద నటుడు రఘుబాబు కన్నీళ్లు పెట్టుకోవడం అక్కడున్న వారిని కలచివేసింది. 'నాన్నా' అంటూ ఆయన భావోద్వేగానికి గురైన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. కుటుంబ సభ్యులను ఓదార్చడం అక్కడున్న వారికి కష్టంగా మారింది. గిరిబాబుతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ అభిమానులు, స్థానికులు నివాళులు అర్పించారు. అంతకుముందు గిరిబాబు పార్థివదేహానికి పలువురు సినీ ప్రముఖులు నివాళులు అర్పించారు.

నటుడు మోహన్ బాబుతో పాటు చిత్ర పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు ఆయనకు తుది వీడ్కోలు పలికారు. రావినూతల గ్రామమంటే గిరిబాబుకు ఎంతో ఇష్టమని, తన అంత్యక్రియలు అక్కడే జరగాలని ఆయన కోరుకున్నట్లు కుమారులు రఘుబాబు, రవిబాబు తెలిపారు. ఇప్పుడు స్వగ్రామంలోనే అంతక్రియలు నిర్వహించి గిరిబాబు చివరి కోరిక నెరవేర్చారు ఆయన కుమారులు.

గిరిబాబు మరణం తెలుగు సినీ పరిశ్రమకు తీరని లోటని పలువురు తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు. విలక్షణమైన నటనతో దశాబ్దాల పాటు ప్రేక్షకులను అలరించిన గిరిబాబు ఇక లేరనే వార్తతో తెలుగు సినీ అభిమానులు విషాదంలో మునిగిపోయారు. ఆయన నటనను, సినిమాలకు అందించిన సేవలను గుర్తుచేసుకుంటూ సోషల్ మీడియాలో నివాళులు అర్పిస్తున్నారు.

సీతను యోధురాలిగా చూపటంలో తప్పేమీ లేదు..





సీతను యోధురాలిగా చూపించటం కొత్త ప్రయోగమేమీ కాదని 'రామాయణ' దర్శకుడు నితేశ్ తివారీ అన్నారు. ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన 'రామాయణ'లో సీత పాత్రలో సాయిపల్లవి నటించిన సంగతి తెలిసిందే. అయితే ఈ చిత్రంలో సీత యోధురాలిగా, పోరాట సన్నివేశాల్లో పాల్గొనడంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. తాజాగా ఈ విమర్శలపై చిత్ర దర్శకుడు నితేశ్ తివారీ స్పందించారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. సీతను యోధురాలిగా చూపించడం వెనుక కారణాలు ఉన్నాయని ఆయన వెల్లడించారు. సంస్కృతంలో ఉన్న 'అద్భుత రామాయణం', 15వ శతాబ్దానికి చెందిన ఒడియా 'బిలంక రామాయణం' కథనాల్లో సీత పాత్ర చాలా భిన్నంగా ఉంటుంది. అందులో సీత కేవలం కష్టాలను భరించడమే కాకుండా.. శక్తిమంతమైన యోధురాలిగా కనిపిస్తారు. ఆమె సహనానికి ప్రతిరూపమే కాదు.. యుద్ధం చేసే వీరనారి. విశ్వశక్తి స్వరూపిణి కూడా. కొన్ని కథల్లో శ్రీరాముడికి ఇబ్బందికర పరిస్థితి ఎదురైనప్పుడు.. సీత మహాకాళి రూపాన్ని ధరించి, 'సహస్ర రావణుడి'ని సంహరిస్తుంది. పలు ప్రాంతీయ రామాయణాల్లో సీతను అలా చూపించారు. ఇది కొత్తగా చేసిన ప్రయోగమేమీ కాదు. ఆ కథల స్ఫూర్తితోనే మా 'రామయణ'లో సీతను అలా చూపించాం" అని నితేశ్ తెలిపారు.

ఇదే విషయంపై చిత్రంలో కైకేయి పాత్ర పోషించిన లారా దత్తా కూడా గతంలో స్పందించారు. సినిమాను ఆస్వాదించండి. రాజకుటుంబాల్లో పుట్టిన అబ్బాయిలు, అమ్మాయిలకు అప్పట్లోనే కళలతో పాటు యుద్ధ విద్యలోనూ శిక్షణ ఇచ్చేవారు. అలాంటప్పుడు సీతకు యుద్ధ విద్య తెలిసి ఉండటంలో ఆశ్చర్యమేమీ లేదు" అని ఆమె పేర్కొన్నారు. ఇక రామాయణ తొలి భాగం నవంబర్ 5న ప్రేక్షకుల ముందుకొచ్చింది. రెండో భాగం 2028లో విడుదల కానుంది.

కొణిదెల పవన్ తేజ్ 'జంట' ప్రారంభం



కొణిదెల పవన్ తేజ్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'జంట' ఆదివారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. పాడని కుమార్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని వసుంధర ఆర్ట్స్ బ్యానర్‌పై రాజేష్ గునిశెట్టి, వీరు యాదవ్ నిర్మిస్తున్నారు. రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే యూనిక్ లవ్ అండ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా దర్శకుడు రాజశేఖర్ యాదవ్ ఈ సినిమాను రూపొందిస్తున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం టైటిల్, ఫస్ట్ లుక్‌ను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మెట్ల రమణబాబు, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మెట్ల రమణబాబు మాట్లాడుతూ అమలాపురం ప్రాంతంలో గతంలో 'దసరా బుల్లోడు'తో పాటు ఎన్నో సినిమాల చిత్రీకరణ జరిగిందని గుర్తుచేశారు. ఇప్పుడు 'జంట' సినిమా షూటింగ్ కోసం ఈ ప్రాంతాన్ని ఎంచుకోవడం సంతోషంగా ఉందన్నారు. కొణిదెల పవన్ తేజ్‌కు ఇది రెండో సినిమా అని, ఈ చిత్రంతో మెగా ఫ్యామిలీలో మరో పెద్ద హీరోగా పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు.

పవన్ తేజ్ కొణిదెల మాట్లాడుతూ.. బలమైన కథతో ఈ సినిమా చేస్తున్నామన్నారు. ఈ చిత్రంలో హీరోగా నటించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా. సినిమాలో మంచి ఎమోషనల్ డ్రైవ్, మాస్ ఎలిమెంట్స్ ఉంటాయి. మా సినిమా క్యాప్షన్ .. యుద్ధం రాముడితో కాదు.. రాజ్యంతో.. ఈ క్యాప్షన్ చూసి చాలా మంది ఫోన్లు చేస్తున్నారు. ఇది మా కథకు యాప్ట్‌గా ఉంటుంది. మొదట్లో హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరించాలని అనుకున్నాం. ఆంధ్రా వైపు కూడా మన సినిమాల షూటింగ్స్ జరగాలని భావించి అమలాపురంకు షిఫ్ట్ అయ్యాం. త్వరలోనే సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది" అన్నారు.

నిర్మాత రాజేష్ గునిశెట్టి మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్ట్ కోసం రెండేళ్లుగా పనిచేస్తున్నాం. కథకు అనుగుణంగా అమలాపురం పరిసర ప్రాంతాలు సరిపోతాయని భావించి ఇక్కడ షూటింగ్ చేయాలని నిర్ణయించుకున్నామన్నారు.

'జంట' తనకు తొలి తెలుగు సినిమా అని, ఈ అవకాశం రావడం ఆనందంగా ఉందని హీరోయిన్ పాడని కుమార్ తెలిపారు. అరుణ్ పాండియన్, కల్పలత, నవీన్ నేని, అశోక్, శ్రావణ సంధ్య తదితరులు ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారన్నారు.

19 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో '418'



చైత్ర ఆచార్, సూర్య రాజ్ ప్రధానపాత్రల్లో నటించిన హారర్ సినిమా '418'. ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. తాజాగా ఈ సినిమా ఓటీటీ విడుదల తేదీని లాక్ చేసుకుంది. కీర్తన్ నాదగౌడ దర్శకత్వం వహించిన ఈ సినిమా నవంబర్ 19 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ కానుంది.

ఊరికి దూరంగా ఉన్న ఓ మెడికల్ కళాశాల హాస్టల్‌ను మూతపడిన 15 ఏళ్ల తర్వాత తిరిగి తెరుస్తారు. కానీ అందులో 418 నంబర్ గది మాత్రం మూసే ఉంటుంది. ఆ గది పేరెత్తితే చాలు.. దాని గురించి తెలిసినవాళ్లంతా గజ గజ వణికిపోతుంటారు. ఆ హాస్టల్లోకి మహిళలకు ప్రవేశం కూడా ఉండదు. అందుకు కారణం కూడా ఆ గదే. 417 గదిలో వివేక్ అనే విద్యార్థి (సూర్య రాజ్) చేరతాడు. అప్పట్నుంచి అతడికి భయంకరమైన దృశ్యాలు కనిపిస్తుంటాయి, కొన్ని పీడకలలు వెంటాడతాయి. అతడిపై హత్యాయత్నం కూడా జరుగుతుంది. అందుకు కారణం 418 నంబర్ గదే అని ఆ తర్వాత అర్థమవుతుంది. ఇన్నేళ్లుగా మూసి ఉన్న ఆ గదిలో ఉన్నది ఎవరు? ఆ గది వెనకున్న రహస్యాలేమిటి అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

చదలవాడ శ్రీనివాసరావు దర్శకత్వంలో 'రక్తధార'



ప్రముఖ నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు పుట్టిన రోజు నవంబర్ 15. ఈ సందర్భంగా పలువురు సినీ ప్రముఖులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్ శివారు కొల్లూరులోని ఏసియన్ టింబర్ ఎస్టేట్‌లో చదలవాడ శ్రీనివాసరావు సినీ పాత్రికేయుల సమక్షంలో పుట్టిన రోజు వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తన స్వీయ దర్శకత్వంలో రాబోతున్న మూడో చిత్రం వివరాలను తెలిపారు. నాలుగు దశాబ్దాలుగా ఎన్నో చిత్రాలను నిర్మించి, ఘన విజయాలను సొంతం చేసుకున్న శ్రీనివాసరావు ప్రస్తుతం తెలుగు నిర్మాతల మండలి కోశాధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

ఇంతకుముందు రెండు సినిమాలకు దర్వకత్వం వహించానన్నారు. ఆర్. నారాయణమూర్తి టైటిల్ రోల్‌లో నటించిన 'హెడ్ కానిస్టేబుల్ వెంకట్రామయ్య' 2017 జనవరి 14న విడుదలైంది. నా పోలీసు మిత్రులకోసం తీసిన ఈ సినిమా మేకర్ గా నాకు ఎంతో తృప్తిని కలిగించిందన్నారు. రెండో సినిమాగా 'ఇద్దరు యువకులు ప్రధాన పాత్రధారులుగా 'రికార్డ్ బ్రేక్'ను 2024లో తీశాను. తాను దర్శకత్వం వహించబోతున్న మూడో సినిమా గురించి వివరిస్తూ, 'ఇది వాస్తవ సంఘటనల ఆధారంగా తీయబోతున్న సినిమా. కొద్ది నెలల క్రితం రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల కేంద్రంలో ఓ ఘోరమైన సంఘటన చోటు చేసుకుంది. చెడు వ్యసనాలకు బానిస అయిన ఓ వ్యక్తి ప్రేమించి పెళ్ళి చేసుకున్న భార్యను, ఇద్దరు పిల్లలను క్రూరంగా చంపేశాడు. అంతేకాదు. ఓ మైనర్ బాలికను ఆమె కుటుంబ సభ్యులను సైతం హత్య చేశాడు. ఈ ఘోరకలి నేపథ్యంలో తీయబోతున్న సినిమాకు 'రక్తధార' అనే పేరు పెట్టాం. టైటిల్ రిజిస్ట్రేషన్ అయ్యింది. మరో నెల రోజుల్లో నటీనటులందరినీ ఎంపిక చేసి పూర్తి వివరాలు ప్రకటిస్తాం' అని అన్నారు.

కీలకపాత్రలో సురేఖావాణి!

ఈ సినిమా కథను తయారు చేసే విషయంలో సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్ బత్తుల ప్రసాద్, దర్శకనిర్మాత పి. సునీల్ కుమార్ రెడ్డి ఎంతో సహకారం అందించారని శ్రీనివాసరావు తెలిపారు. సంఘటన జరిగిన ప్రాంతానికి వెళ్ళి, అక్కడ వ్యక్తులను కలిసి, వాస్తవ వివరాలను సేకరించి, ఈ కథను రూపొందించారని చెప్పారు. ' రక్తధార' చిత్రాన్ని ప్రముఖ నిర్మాత తుమ్మల ప్రసన్న కుమార్ నిర్మించబోతున్నారని, ఇందులో హంతకుడి తల్లి పాత్రను సురేఖ వాణి పోషిస్తున్నారన్నారు.

ప్రముఖ దర్శకుడు అజయ్ కుమార్, అల్లాణి శ్రీధర్, అళహరి, చిత్రపురి కాలనీ మాజీ అధ్యక్షుడు వల్లభనేని అనిల్ కుమార్ తదితరులు చదలవాడ శ్రీనివాసరావును స్వయంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు